ప్రజాశక్తి
శుక్రవారం 31 అక్టోబర్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

వీడని వరద..



నాగులుప్పలపాడు మండలం, చీర్వానుప్పలపాడు గ్రామాన్ని ముంచెత్తిన వరద నీరు

- కన్నీళ్లు మిగిల్చిన మొంథా తుపాన్
- వేలాది ఎకరాల్లో పంటలకు నష్టం
- రోడ్లు కోతకు గురై రాకపోకలకు ఇక్కట్లు
- ఒంగోలులోని కాలనీల్లో బురదను తొలగిస్తున్న అధికారులు
- ఉధృతంగా గుండ్లకమ్మ నది
- చీర్వానువ్వలపాడును ముంచెత్తిన వరద నీరు

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో, బాపట్ల జిల్లా

మొంథా తుపాన్ ప్రకాశం, బాపట్ల జిల్లాలను అతలాకుతలం చేసింది. వర్షాల వల్ల ప్రజల ఆస్తులకు భారీ నష్టం జరిగింది. వేలాది ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. రోడ్లు కోతకు గురయ్యాయి. ఎన్నడూ లేని విధంగా జాతీయరహదారులపైనా నీరు ప్రవహించింది. వర్షపు నీరు సముద్రంలో కలిసేమార్గం లేక ముంపు సమస్య తలెత్తింది. వరద నీటి కారణంగా నాగులుప్పలపాడు మండలంలోని చీర్వానువ్వలపాడు, మద్దిరాలపాడు గ్రామాలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి.

వరద నీటి కారణంగా ఒంగోలు పట్టణంలో సుమారు 20 కాలనీల్లోకి మోకాళ్లలోతు నీరు చేరింది. నవోదయ పాఠశాల ముంపునకు గురికావడం ఇదే మొదటిసారి.. పట్టణంలోని కాలనీల నుంచి నీటిని బయటకు పంపారు. ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నాయి. వీధుల్లో ఉన్న బురదను మున్సిపల్ అధికారులు తొలగించే చర్యలు చేపట్టారు. ముంపు ప్రాంతాలు తేరుకుంటున్నాయి. కలెక్టర్ రాజాబాబు, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పట్టణంలోని ముంపు కాలనీపై దృష్టి సారించారు. సహాయకచర్యలు వేగవంతం చేశారు. భారీ వర్షాలకు గుండ్లకమ్మ మొదలు.. అన్నీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. గుండ్లకమ్మ గేట్లు ఎత్తడంతో లక్షా 20 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి వెళుతోంది. ఈ ప్రాజెక్టు నిర్మాణం జరిగాక ఈ స్థాయిలో నీరు దిగువకు వెళ్లడం కూడా ఇదే మొదటిసారిగా చెబుతున్నారు. పశ్చిమాన వెలుగొండ సొరంగాల్లోకి వరదనీరు చేరింది. దాని కాలువలకూ గండ్లు పడ్డాయి. నల్లమలలో ▶ 2లో



ముండ్లమూరు మండలంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి



ఒంగోలులో వరద బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్



బాపట్ల జిల్లాలో ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న మంత్రులు పార్ధసారథి, గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి

ఏసీబీ వలలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

రూ.1.25 లక్షల లంచం తీసుకుంటూ దొరికిన వైనం ▶ 2లో

80,467 ఎకరాల్లో పంట నష్టం

ప్రజాశక్తి- బాపట్ల జిల్లా

మొంథా తుపాను కారణంగా బాపట్ల జిల్లాలో 80,467 ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయశాఖ అధికారులు అంచనాల నివేదిక రూపొందించారు. జిల్లాలో తుపాను కారణంగా 273 గ్రామాలలో 54,003 మంది రైతులకు సంబంధించిన పంటలు వరి 68,069 ఎకరాల్లో, మొక్కజొన్న 3,506 ఎకరాలు, మినుము 4,668 ఎకరాలు, పత్తి 3,257, వేరుశనగ 338 ఎకరాలు, ఇతర పంటలు మొత్తంగా 80,467 ఎకరాల్లో వివిధ రకాల వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లినట్లు నివేదిక ఇచ్చారు. అలానే జిల్లాలో 5,200 ఎకరాల్లో ఉద్యానపంటలకు నష్టం వాటిల్లినట్లు నివేదిక ఇచ్చారు.



కొండపిలో భారీవర్షాలకు దెబ్బతిన్న బొప్పాయి పంట

'ప్రకాశం'లో 23,085 హెక్టార్లలో..

ఒంగోలు కలెక్టరేట్: 'మొంథా' తుపాన్ వల్ల రైతుల ఆరుగాలం కష్టం నీటిపాలైంది. తుపాన్ కారణంగా కురుస్తున్న భారీ వర్షాలతో 23,085 హెక్టార్లలో రైతులు సాగు చేసిన వివిధ పంటలు నీటమునిగాయి. 32 మండలాలలో 28,183 మంది రైతులు నష్టపోయారు. వరి, మొక్కజొన్న, మినుములు, పత్తి, సజ్జ, ▶ 2లో

వీడని వరద

(మొదటిపేజీ తరువాయి)

కురిసిన వర్షాలకు కంభం చెరువు నిండి అలుగు పారింది. చెరువులు నిండాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. ఆ ప్రాంతంలో నీటి కరువు తీరింది. పంటలకు నష్టం జరిగింది. పత్తి, మిర్చి, జొన్న సజ్జ తదితర పంటలు నీటమునిగాయి. తోటల్లో పచ్చి మిరపకాయలు రాలిపోయాయి. పత్తి తడిసింది. నల్లగా మారే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. పలుచోట్ల రోడ్లు భారీగా దెబ్బతిన్నాయి. ఒంగోలు-కొత్తపట్నం మార్గంలో మూడు రోజులుగా ప్రవహిస్తున్న వాగుల వల్ల రాకపోకలు నిలిచిపోయాయి. సహాయకచర్యలకూ ఆటంకం ఏర్పడింది. ఇక పర్యటనలు, పరామర్శలు మొదలయ్యాయి. నష్టం అంచనాలపైనా ఆయా శాఖల అధికారులు దృష్టి సారించారు. మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి టంగుటూరు మండలం మల్లవరప్పాడులో వరద ఉధృతికి కోతకు గురైన రోడ్డును పరిశీలించారు. అనంతవరంలో నీటమునిగిన ఎస్టీ కాలనీలో పర్యటించి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆలకూరపాడులో పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా పర్చూరు నియోజకవర్గంలో పంటలకు భారీగా నష్టం జరిగింది. మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. పర్చూరులో నిల్వ ఉంచిన పొగాకు మండెలను పరిశీలించారు. పొగాకు తడిసిపోయింది. వరి, వంగ, వేరుశనగ, ఇతర ఉద్యానవన పంటలకు భారీగా నష్టం జరిగింది. నష్టాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతామని మంత్రి గొట్టిపాటి రైతులకు భరోసా ఇచ్చారు. కొత్తపట్నం మండలంలో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల పర్యటించారు. వర్షాలకు దెబ్బతిన్న ప్రాంతాలను, పంటలను పరిశీలించారు. జిల్లాలో శాసనసభ్యులు వారి నియోజకవర్గాల్లో పర్యటించారు. నష్టం భారీగానే జరిగింది. పూర్తిస్థాయిలో నష్టం అంచనాలు రూపొందించాల్సి ఉంది. వర్షం పోయింది కదా? అనే భావనలో ఉంటే ఈ నష్టం వెలుగులోకి రాకుండా పోతుంది. ముంపుపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి. కాలనీలు, పొలాలు మునగడానికి కారణమైన అంశాలపై దృష్టి పెట్టాలి. వాగులు, కాలువలు అన్నీ మూసుకుపోయాయి. ఆక్రమణలకు గురయ్యాయి. అవే ఇప్పుడు జనం కొంపలను ముంచాయి.

జల దిగ్బంధనంలో చీర్వానుప్పలపాడు, మద్దిరాలపాడు

నాగులుప్పలపాడు: మొంథా తుపాన్ ప్రభావంతో భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగి ప్రవహించడంతో పాటు చెరువులకు గండి పడింది. వరద నీటితో మండలంలోని చీర్వానుప్పలపాడు, మద్దిరాలపాడు గ్రామాలు జల దిగ్బంధనంలో చిక్కుకున్నాయి. దీంతో ప్రజలు నిద్రాహారాలు లేకపోవడంతో పాటు చలితో వణికిపోయారు ఈ నేపథ్యంలో గుండ్లకమ్మ ప్రాజెక్టుకు భారీగా వరద నీరు చేరడంతో 15 గేట్లు ఎత్తి కిందకు వదిలారు. దీంతో దిగువన ఉన్న గ్రామాలు జలదిగ్బంధనంలో ఉన్నాయి. మద్దిరాలపాడు వద్ద 216 జాతీయ రహదారిపైకి బారీగా నీరు పొంగి ప్రవహించడంతో చీరాల-ఒంగోలుకు రాకపోకలు నిలిచిపోయాయి. ఆ వరద నీరు మద్దిరాలపాడు, ముస్లిం కాలనీ, ఎస్ టి కాలనీలను వరద ముంచెత్తడంతో అక్కడి ప్రజలను క్లస్టర్ ఇన్‌ఛార్జి గుమ్మడి సాయిబాబా, సర్పంచ్, ఉపసర్పంచ్ స్వర్ణ అనూరాధ, సునీల్ సురక్షిత ప్రాంతానికి తరలించి.. బోజన వసతులు కల్పించారు. పాత చీర్వానుప్పలపాడును వరద ముంచెత్తడంతో అక్కడి ప్రజలూ జలదిగ్బంధనంలో చిక్కుకుపోయారు. వినోదరాయినిపాలెంను వరద ముంచెత్తడంతో అక్కడి ప్రజలు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చదలవాడ సచివాలయం జలదిగ్బంధనంలో ఉంది. తుపాన్ ప్రభావంతో కురిసిన బారీవర్షాలకు ఉప్పుగుండూరులోని పరబీడు కాలనీ, మసీదు కాలనీ, చింతతోపుకాలనీ, ఎస్‌టి కాలనీ, బిసి కాలనీవాసులు ఇండ్లలోకి నీరు చేరి.. నేటికీ తగ్గకపోవడంతో భోజనానికి కూడా తల్లడిల్లిపోయారు. చలికి వణికిపోయారు. ఈదుమూడి-మద్దిరాలపాడు వద్ద రోడ్డు కోతకు గురై పైనుండి వచ్చే నీరు మద్దిరాలపాడును ముంచెత్తింది. కొత్తకోట వాగు గురువారం కూడా పొంగి ప్రవహించింది. ముప్పాళ్ళలో చెరువుకు గండి పడడంతో అధికారులు జెసిబితో వెంటనే పూడ్చడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. చదలవాడ, తిమ్మసముద్రం విద్యుత్ సబ్‌స్టేషన్లలో నీరు చేరింది. అగ్రహారం, మాచవరం తదితర గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు ఒరిగిపోయాయి. ఈ నేపథ్యంలో తహశీల్దార్ ప్రవీణ్ కుమార్, ఎంపిడిఓ రవికుమార్, ఎపిఓ రవిబాబు, తుఫాన్ పర్యవేక్షణాధికారి, దర్శి డిఎస్‌పి లక్ష్మినారాయణ, ఒంగోలు డిఎస్‌పి శ్రీనివాసరావు, సిఐ శ్రీకాంత్‌బాబు, ఎస్‌ఐ రజియా సుల్తానా, వివిధశాఖల సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వాగుల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు రెండు పర్యాయాలు మండలంలో పర్యటించి.. వరద ఉధతిని పరిశీలించి.. అధికారులకు తగు సూచనలు చేశారు. దెబ్బతిన్న పంటలను వ్యవసాయాధికారులు జెడిఏ శ్రీనివాసరావు, ఏడిఏ రమేష్ బాబు, ఏఓ వెంకట్రావు, ఉద్యానవన శాఖాధికారి సంధ్య పరిశీలించారు. మండలంలో 2500 ఎకరాలలో వరి దెబ్బతిన్నట్లు ఏవో తెలిపారు.

80,467 ఎకరాల్లో పంట నష్టం

(మొదటిపేజీ తరువాయి)

ఆముదం, పొగాకు పంటలు ఎక్కువగా నీట మునిగాయి. ఇందులో జొన్న 61.4 హెక్టార్లు, సజ్జ 1855 హెక్టార్లు, మొక్క జొన్న 2514 హెక్టార్లు, పత్తి 10,742 హెక్టార్లు, వేరుశనగ 28.70 హెక్టార్లు, వరి 3440.70 హెక్టార్లు, మినుములు 1940 హెక్టార్లు, పెసలు 2 హెక్టార్లు, కౌ గ్రామ్, 1687 పొగాకు 769 హెక్టార్లు, ఆముదం 46 హెక్టార్లు పంట నీట మునిగింది.

ఏసీబీ వలలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

రూ.1.25 లక్షల లంచం తీసుకుంటూ దొరికిన వైనం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రేపల్లే రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ వివి రమణారావు రూ.1.25 లక్షలు లంచం తీసుకుంటూ గురువారం నాడు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ప్రస్తుతం నగరవనంలో రూ.5.90 లక్షల విలువ గల పనులు కాంట్రాక్టర్ వీర్లంకయ్య చేయగా ఈ బిల్లుకు సంబంధించి 25 శాతం అంటే ఒక లక్ష పాతిక వేలను ఫారెస్ట్ ఆఫీసర్ డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని కాంట్రాక్టర్ ఏసిబి అధికారులను ఆశ్రయించారు. గురువారం బాపట్ల - సూర్యలంక రోడ్డులోని నగరవనంలో ఫారెస్ట్ ఆఫీసర్ అడిగిన లంచం నగదును కాంట్రాక్టర్ ఇస్తుండగా ఏసీబీ ఏఎస్‌పి మహేంద్రనాథ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

పునరావాస కేంద్రం సందర్శన

ప్రజాశక్తి-సంతనూతలపాడు

మండలంలోని పేర్నమిట్ట పరిధిలోని క్విజ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన తుపాను పునరావాస కేంద్రాన్ని ఎస్ఎన్ పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్ గురువారం సందర్శించారు. అక్కడ బాధితులకు ఉదయం అల్పాహారం అందించారు. బాధితులను అన్ని విధాలుగా అదుకుంటామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఎవరు కూడా అధైర్య పడవద్దని ఆయన ధైర్యం చెప్పారు. వీరికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం 39వ డివిజన్‌లో ఎస్టీ కాలనీలో పర్యటించి రోడ్లను, సైడ్ డ్రైనేజీలను పరిశీలించారు. రోడ్లను, సైడ్ డ్రైనేజీలను పరిశుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ నారాయణరెడ్డి, నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త కందుకూరి వెంకటేశ్వరరావు (బాబు), కార్పొరేటర్ మలగా రమేష్, నాయకులు నూకతోటి ఈశ్వరరావు, అరికట్ల సుమతి, కొల్లా మహేష్, వాసేపల్లి వెంకటేశ్వరరెడ్డి, పెసలా శ్రీనివాసరావు, కరిచేటి శ్రీనివాసరావు, షేక్ కాలేషా, షేక్ అమానుల్లా, కల్లూరి వెంకటేశ్వర్లు, జానీ, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



పునరావాస కేంద్రంలో భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే బీఎన్

2న తెప్పోత్సవం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

వచ్చే నెల రెండో తేదీన జరగనున్న మార్కాపురం లక్ష్మీ చెన్నకేశవ స్వామి తెప్పోత్సవాన్ని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కోరారు. గురువారం సాయంత్రం స్థానిక ఉప కలెక్టర్ కార్యాలయంలో లక్ష్మీ చెన్నకేశవ స్వామి తెప్పోత్సవం సందర్భంగా రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక, ఎక్సైజ్, ఆర్అండ్‌బి అధికారులతో మార్కాపురం ఇన్‌ఛార్జి ఉప కలెక్టర్ శివరామి రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మాట్లాడారు. మార్కాపురం పురపాలక సంఘం కమిషనర్ డివిఎస్ నారాయణ రావు, తహశీల్దార్ కే చిరంజీవి, మార్కాపురం అగ్నిమాపక కేంద్రం అధికారి ఆర్ రామకృష్ణ, పట్టణ ఎస్ఐ ఎం సైదుబాబు, ఎక్సైజ్ ఎస్ఐ గోపాలకృష్ణ, ఆర్అండ్‌బి ఏఈ షబ్బీర్ హుస్సేన్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఇప్పటికీ నీటిలోనే..

- పట్టించుకోని అధికారులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

తుపాను తీరం దాటి రెండు రోజులు అవుతున్నప్పటికీ ఆగ్రామాల్లో వర్షపు నీరు చుక్క కూడా బయటకి పోలేదు. నీటిలోనే నడుచుకుంటూ ఇళ్లలోకి వెళ్లే దారులు కనిపించక ప్రజలు అవస్థలు పడుతున్నారు. శింగరాయకొండ మండలం ఊళ్ల పాలెం గ్రామపంచాయతీలోని బేసిన్‌పల్లి పాలెం, బావి వద్ద పల్లిపాలెం, దేవరం పల్లిపాలెం, పాకల గ్రామపంచాయతీ పరిధిలోని పోతయ్య గారి పట్టపు పాలెంలో వర్షం నీరు ముందుకు కదలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినప్పటికీ వారి గురించి పట్టించుకొనే వారు కనిపించడం లేదు. నీరంతా రోడ్లపై ఉండడంతో మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మద్దిపాడు : మండల పరిధిలోని రాచవారిపాలెం ఎస్‌సి, ఎస్ టి కాలనీలు ఇప్పటికీ వరద నీటిలోనే ఉన్నాయి. ఆయా కాలనీల్లో మోకాళ్ళ లోతులోన నీరు నిలిచి ఉంది. గుండ్లకమ్మ గేట్లు ఎత్తడంతో బుధవారం రాత్రి గ్రామంలోకి



నీటిలో నడస్తున్న మహిళలు



ఊళ్ల పాలెంలో గృహాలను చుట్టుముట్టిన నీరు

నీరు చేరాయి. 250 మంది వరకు పునరావాస కేంద్రానికి తరలించారు. ఎస్‌సి కాలనీకి పక్కన ఉన్న వాగు పొంగిపొర్లడంతో పాటు, గుండ్లకమ్మ నీళ్ల గ్రామంలోకి రావడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లోకి నీళ్ల వచ్చాయి. చిన్నపిల్లలు, వద్దులు ఇబ్బందులు పడ్డారు.

జరుగుమల్లి : మొంథా తుపాను ప్రభావంతో ఇనగలేరు పొంగిప్రవహించింది. దీంతో మండల పరిధిలోని వావిలేటిపాడు ఆర్‌అండ్‌బి రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహించింది. వావిలేటిపాడు నుంచి చెరువు వరకూ సుమారు కిలోమీటరు దూరం 4 అడుగుల లోతున రహదారిపై నీరు ప్రవహించింది. దీంతో 40 గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అధికారులు, సచివాలయ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది అనేక ఇబ్బందులకు గురయ్యారు. రాక పోకలకు అంతరాయం ఏర్పడింది. జరుగుమల్లి తహశీల్దారు పి.మురళీ, ఎస్‌ఐ. బి. మహేంద్ర ఆధ్వర్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకుండా తగు చర్యలు తీసుకున్నారు.

కొండపి : మొంథా తుపాన్ ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. పొగాకు నారుమడులు నీట మునిగాయి. కట్టవారిపాలెం, పెట్లూరు గ్రామాల్లో బొప్పాయి తోటలు నేలకొరిగాయి. పొగాకు బ్యారెన్లు కూలిపోయాయి. పొగాకు నాట్లు నీట మునిగాయి. పంటలు నష్టపోయిన తమకు ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

కొనకనమిట్ల : తుపాను ప్రభావంతో కురిసిన వర్షానికి మండల పరిధిలోని పెదారికట్ల పశువైద్యశాల ఆవరణ నీటితో నిండిపోయింది. దీంతో పశుపోషకులు పశువులను, జీవాలను వైద్యశాలకు తీసుకురావటానికి ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశు వైద్యశాల ఆవరణలో నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని పశుపోషకులు కోరుతున్నారు.



రాచవారిపాలెంలో ఇళ్ల మధ్యఉన్న నీరు



వావిలేటిపాడులో రహదారిపై ప్రవహిస్తున్న నీరు



కొత్తపట్నంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

ఎమ్మెల్యే దామచర్ల సుడిగాలి పర్యటన

ప్రజాశక్తి- కొత్తపట్నం

కొత్తపట్నం మండలంలో ఒంగోలు దామచర్ల జనార్ధన్ గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ఒంగోలు నుంచి కొత్తపట్నం వచ్చే మార్గం జలమయం కావడంతో పరిశీలించారు. చింతల గ్రామంలోనిటిక్కో ఇళ్ల వద్ద అధికంగా ప్రవహిస్తున్న నీళ్లను పరిశీలించారు. బకింగ్ హామ్ కెనాల్ బ్రిడ్జి వద్ద అధికంగా ప్రవహిస్తున్న నీళ్లను దిగువకు పంపించేందుకై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గంగమ్మ గుడి వద్ద ఉన్న ఎస్‌సి కాలనీ వాసులు తమ కాలనీ నీట మునిగిందని తమను ఆదుకోవాలని కోరారు. నీరు తగ్గేవరకూ హైస్కూల్లో ఉండాలని, ఆహార సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాదర్తి ,గుండమాల ,మోటుమాల గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ, మండల స్పెషల్ ఆఫీసర్ .నారాయణ, తహశీల్దారు శాంతి, ఎంపిడిఒ శ్రీకృష్ణ పాల్గొన్నారు.

చీమకుర్తి సిఐగా దాసరి ప్రసాద్

ప్రజాశక్తి-చీమకుర్తి




చీమకుర్తి సిఐగా దాసరి ప్రసాద్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన మెరైన్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తూ బదిలీ చీమకుర్తి సిఐగా నియమితు లయ్యారు. ఈ సందర్భంగా సిఐ ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో శాంతి భద్రతల పరిరక్షణ, చీమకుర్తిలో ట్రాఫిక్ నియంత్రణకు కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు సిఐని మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి -మద్దిపాడు

మండల పరిధిలోని వెల్లంపల్లి ఎస్‌టి కాలనీలో వర్షపు నీటిలో చిక్కుకున్న ప్రజలకు ఎంపిటిసి దుర్గ భవాని తన సొంత నిధులతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి పార్థసారథి, తహశీల్దారు ఆదిలక్ష్మి చేతుల మీదుగా గురువారం నిత్యావసర సరుకులు అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు అందజేశారు. అదేవిధంగా సర్పంచి చిట్టిపోయిన అనీల్, ఎంపీటీసీ దుర్గాభవాని, పంచాయతీ కార్యదర్శి మాధవి ఎస్‌కాలనీలో ఇళ్లలోకి చేరిన నీటిని తొలగించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి దాట్ల శివరాం గోపాల్ రాజు, ఆర్‌ఐ రమణయ్య, విఆర్‌ఒ పూజిత తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న మండవ జయంత్ బాబు

రత్తయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని గడియపూడిలో చింతల రత్తయ్య దశదిన కర్మ గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎపి రాష్ట్ర పొగాకు ఉత్పత్తి దారుల సహకార సమాఖ్య చైర్మన్ మండవ జయంత్ బాబు పాల్గొని రత్తయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన కొలచనకోట గ్రామ ఉపసర్పంచి దేవభక్తుని ప్రసాద్, టిడిపి నాయకులు చింతల శ్రీనివాసరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రొయ్యల చెరువులు తొలగించాలి : సిపిఎం

ప్రజాశక్తి- కొత్తపట్నం

కొత్తపట్నం మండలంలో వరద నీరు సముద్రంలో కలిసే ప్రాంతంలో అడ్డుగా ఉన్న అక్రమ రొయ్యల చెరువులను తొలగించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. తుపాను పరిస్థితిని పరిశీలించేందుకు జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ గురువారం మండల పరిధిలోని అల్లూరు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఎస్.స్వామిరెడ్డి జేసీని కలిసి వరద ముంపు గురించి ఆయన వివరించారు. కొత్తపట్నంకు పైనుంచి వచ్చే వరద నీరు పోయే మార్గాలైన దక్షిణం వైపు తేటుపురం వద్ద, ఉత్తరం వైపు గుండ మాల దగ్గర సముద్రంలో కలిసే మార్గాలను కొందరు ఆక్రమించి రొయ్యలు చెరువులు చేస్తున్నట్లు తెలిపారు. ఫలితంగా కొత్తపట్నం మండలానికి వరద ఉప్పు పొంచిఉన్నట్లు తెలిపారు. గతంలో వరద నీరు వచ్చిన ఒక్క రోజులోనే సముద్రంలోకి వెళ్లేదని



జేసీకి సమస్య వివరిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి స్వామిరెడ్డి

తెలిపారు. ప్రస్తుతం పదిరోజులుగా అలాగే ఉందన్నారు. దీంతో పంటలు ముంపునకు గురైనట్లు తెలిపారు. ప్రజలు అనేక ఇబ్బందుకలు గురైనట్లు తెలిపారు. అక్రమ రొయ్యల చెరువులను తొలగించాలని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు.

అటవీశాఖ గోడౌన్‌లో పరిశీలన


ప్రజాశక్తి -కనిగిరి

కనిగిరి అటవీ శాఖ కార్యాలయంలోని రెడ్ శాండిల్ నిల్వ చేసే గోడౌన్లను తనిఖీ చేశారు. అసిస్టెంట్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి శ్రీనివాసరావు గురువారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా ఈ తనిఖీలు నిర్వహించారు. అనంతరం అటవీ శాఖ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు విలేకరులతో మాట్లాడుతూ కనిగిరి ప్రాంతంలో ఎదురవుతున్న రిజర్వ్ ఫారెస్ట్ రెవెన్యూ భూముల వివాదాలకు ఉన్న ఏకైక మార్గం రెవెన్యూ పిఒపి రిజిస్టర్లో రిజర్వ్ ఫారెస్ట్ వివరాలు నమోదు చేయడమేనని తెలిపారు. 50 నుంచి వంద సంవత్సరాల క్రితం రిజర్వ్ ఫారెస్ట్ భూములుగా నిర్ణయించిన వివరాలను పిఒపి రిజిస్టర్లో నమోదు చేయకపోవడం వల్ల వివాదాలు వస్తున్నాయన్నారు. రెవెన్యూ అధికారులు పిఒపి



గోడౌన్‌లో పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

రిజిస్ట్రర్‌లో రిజర్వ్ ఫారెస్ట్ భూముల వివరాలు నమోదు చేస్తే వివాదాలు తలెత్తే పరిస్థితి ఉండదని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో కనిగిరి అటవీశాఖ అధికారి ఉమామహేశ్వర్ రెడ్డి, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

పునరావాస కేంద్రం సందర్శన

ప్రజాశక్తి - మద్దిపాడు

మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన తుఫాన్ పునరావాస కేంద్రాన్ని ఎమ్మెల్యే బిఎన్.విజయ్ కుమార్ గురువారం సందర్శించారు. పునరావాస కేంద్రంలో ఉన్న రాచవారిపాలెం ఎస్‌సి కాలనీ వాసులతో మాట్లాడారు. వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్నం భోజనాన్ని ఎమ్మెల్యే వారికి స్వయంగా వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పొగాకు ఉత్పత్తిదారుల సహకార సమాఖ్య చైర్మన్ మండవ జయంత్ బాబు, రాష్ట్ర 20 సూత్రాల చైర్మన్ లంకా దినకర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి పార్థసారథి, తహశీల్దారు ఆదిలక్ష్మి, ఎపిఒ ధనుంజయ్ వర్మ, మండల అధ్యక్షుడు ఉప్పుగుండూరి నాగేశ్వరరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి దేవభక్తుని ప్రసాద్, తుమ్మల సుధాకర్, పోతినేని శ్రీనివాసరావు, పోకూరి శ్రీనివాసరావు, రావి ఉమామహేశ్వరావు, మండవ గోపి, ఎద్దు సురేష్, గడ్డం రవి, ముల్లూరి మురళి, నవ్వులూరి శివ కష్ణ, రాంబాబు, అజయ్, పంచాయతీ కార్యదర్శులు శ్రీకాంత్, నూరుల్లా, ఆర్‌ఐ రమణయ్య పాల్గొన్నారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రైతులను ఆదుకోవాలన్న సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, రైతు సంఘం నాయకులు


నీటమునిగిన పొగాకు పరిశీలిస్తున్న సిపిఎం బృంధం

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని ఉప్పుటూరులో వర్షాలకు తడిసిన పొగాకు మండేలను సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బండి శంకరయ్య, కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య, ఎస్కె రహీం, బసవయ్య పరిశీలించారు. రైతులు 10 ఎకరాల్లోని 100 క్వింటాళ్లకుపైగా పొగాకు తడిసిపోయిందని తెలిపారు. రూ.13 లక్షలు పెట్టుబడి పెట్టి ఆరుగాలం శ్రమించి పండించిన పొగాకు పూర్తిగా తడిచిపోయిందని గోరంట్ల కోటి బాబు అనే కౌలు రైతు ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల చదువులు సాగేదెలా, పెట్టుబడికి తెచ్చిన అప్పులు తీరేదెలాని అతని భార్య ఆవేదన వర్ణణాతీతం. ఇది కోటి బాబు ఒక్కని ఆవేదనే కాదని, గ్రామంలోని అనేకమంది కౌలు రైతుల ఆవేదనని నాయకులు పేర్కొన్నారు. గ్రామంలో 30 మంది రైతులు పండించిన పొగాకు తడిసిపోయిందని తెలిపారు. ఆ రైతులు అందరినీ ఆదుకోవాలని కోరారు.

మేదరమెట్ల : మండలంలోని పి గుడిపాడులో తుఫాన్ తాకిడికి దెబ్బతిన్న మినుము, మిరప, మొక్కజొన్న పంటలను సిపిఎం బృందం గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం ఆంజనేయులు మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు వై రవీంద్రబాబు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులను సంపూర్ణంగా ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలోని లంక గ్రామాల్లో సిపిఎం బృందం పర్యటించారు. నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. రైతులను కలసి నష్టంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జి సుధాకర్, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జి నాగరాజు మాట్లాడుతూ తుఫాను వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. గతేడాది, ఈ ఏడాది కృష్ణా వరదలు, ఇప్పుడు మొంథా తుఫానుతో కోలుకోలేని విధంగా రైతులు, కౌలు రైతులు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. పంటలు నష్టపోయిన రైతులు, కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మండలంలోని మెట్ట ప్రాంతంలో సాగుచేసిన అరటి, మినుము, బొప్పాయి తోపాటు వరి పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. రైతులు పండించిన పంటలు పెట్టుబడి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నష్టపరిహారాలు గతం కన్నా రెట్టింపు చేసి ఇవ్వాలని కోరారు. ఎకరా అరటికీ రూ.30వేలు, మినుము, వరి మిగిలిన పంటలకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు బ్యాంకుల్లోని రుణాలకు వడ్డీ మాఫీ చేసి, పాత రుణాలు మాఫీ చేయాలని కోరారు. సిపిఎం కన్వీనర్ పి మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సాయం చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల వచ్చిన వరదలకు నష్టపరిహారాలు ప్రభుత్వం ఇవ్వలేదని, కష్టాల్లో ఉన్న రైతులు, పేదలను ఆదుకోవాలని కోరారు. సిపిఎం నాయకులు మురుగుడు సత్యనారాయణ, రైతులు ధూళిపాళ్ల శివరామకృష్ణ, సనకా వెంకటేశ్వరావు, సనక రామకృష్ణ, శ్రీను పాల్గొన్నారు.


నష్టపోయిన పంటలు పరిశీలిస్తున్న సిపిఎం బృంధం


భట్టిప్రోలులో పంటలు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు


అభినందిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

మున్సిపల్ సిబ్బందికి భరోసా

ప్రజాశక్తి - అద్దంకి

మొంథా తుఫాన్ ప్రభావంతో గుండ్లకమ్మ నది ఉధృతంగా ప్రవహించింది. అదే సమయంలో విధి నిర్వహణలో ఉన్న మున్సిపల్ సిబ్బంది రుద్రు నరేంద్ర, గుర్రాల బాబూరావు, మెట్నాల శివదుర్గ నది ప్రవాహంలో చిక్కుకున్నారు. ఆ సమయంలో గమనించిన పట్టణంలోని యువకులు బండారు కుమార్, ఇండ్ల మాణిక్యారావు, బొజ్జ పరశురాం, షేక్ మస్తాన్ తమ ప్రాణాలను పణంగా పెట్టి సిబ్బందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. ప్రమాదంలో చిక్కుకుని బయటపడ్డ మున్సిపల్ సిబ్బందిని ఆయన పరామర్శించారు. అదే సమయంలో సాహసోపేతంగా రక్షణ చర్యల్లో పాల్గొన్న యువకులను మంత్రి అభినందించారు. మానవత్వం, సేవాభావంతో ముందుకు వచ్చిన యువకుల ధైర్య సాహసాలు ఆదర్శమని పేర్కొన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని హామీ ఇచ్చారు.


ఆలయ ఛైర్మన్‌కు విరాళం అందజేస్తున్న దాతలు

రాతిమండప నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండ క్షేత్రంలో కొలువైన శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి దేవస్థానంలో పంగులూరు మండలం భగవాన్ రాజుపాలెంకు చెందిన రావిపాటి వీరాంజనేయులు, ధర్మపత్రి పద్మావతి కుమారుడు వీరేంద్ర, కోడలు హిమబిందు, మనోజ్ కుమార్ కుటుంబ సభ్యులు రాతి ముఖ మండపం నిర్మాణానికి రూ.1,01116 విరాళం దేవస్థానం పాలక మండలి చైర్మన్ చుండూరి మురళీ సుధాకరరావుకు అందజేసినారు. దాతలకు తీర్థ ప్రసాదాలు అందించి సన్మానించి స్వామి వారి చిత్రపటం అందజేశారు.


నల్లమడవాగు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

నల్లమడ వాగు వరదతో వరిపైరు మునక

ప్రజాశక్తి - బాపట్ల

నల్లమడ వాగుకు మూలపాలెం సమీపంలో జిల్లెళ్ళమూడి వైపు మురుగు తూముల ద్వారా వరద నీరు ఎగదన్నడంతో వరద నీరు పొలాల్లోకి చేరి 200 ఎకరాల్లో వరిపైరు మునిగిపోయింది. జిల్లెళ్ళమూడికి చెందిన మాతృశ్రీ ఓరియంటల్ కళాశాల వెనుక వైపు వరిపైరు పూర్తిగా నీట మునిగి చెరువులు తలపిస్తోంది. తుఫాను కారణంగా నల్లమడ వాగుకు ఎగువన కురిసిన వర్షాలతో నల్లమడ డ్రెయిన్ ప్రమాదకర స్థాయిని మించి ప్రవహిస్తోంది. నల్లమడ వాగు కట్టలు తెగే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. నల్లమడ వాగు కట్టలు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో కట్ట తెగకుండా డ్రైనేజీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గతంలో జిల్లెలమూడి వంతెన వద్ద దిగువ వైపు నల్లమడ వాగు కట్ట బలహీన పడటంతో రైతుల ఇసుక బస్తాలు అడ్డం వేసి ముంపు బారి నుండి పొలాలు కాపాడుకున్నారు.

చేనేత కార్మికులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - భట్టిపోలు

మొంథా తుఫాను ప్రభావంతో మగ్గం గుంటల్లో నీరుచేరి ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు గతేడాది మంగళగిరిలో చేనేత కార్మికులకు ప్రభుత్వం అందించిన తరహాలో ఆర్థిక సహకారాన్ని అందించి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ ఎపి చేనేత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద చేనేత కార్మికులు గురువారం ధర్నా నిర్వహించారు. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా మొగ్గం గుంటల్లో నీరు చేరి ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులకు రూ.25వేల ఆర్థిక సాయంతో పాటు 50కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎపి చేనేత కార్మిక సంఘం, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు మురుగుడు సత్యనారాయణ, ఎపి చేనేత కార్మిక సంఘం ఏఐటియుసి రాష్ట్ర సహాయ కార్యదర్శి గోటుముక్కల బాలాజీ మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో గత వారం రోజులుగా కురిసిన అధిక వర్షాల కారణంగా మగ్గం గుంటల్లో నీరు చేరటంతో కార్మికులు ఉపాధిని కోల్పోయారని, ఆర్థికపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. వ్యవసాయం తరువాత అతి పెద్ద కుటీర పరిశ్రమగా గుర్తింపు పొందిన చేనేత పరిశ్రమను, కార్మికులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి విడనాడాలని కోరారు. తక్షణం సహాయం అందించాలని కోరారు. ప్రభుత్వం సహాయం అందించే వరకు కార్మికులు ఐక్యంగా దశల వారి పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే చేనేత కార్మికుల జీవితాలు మెరుగు పర్చేందుకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నేతన్నలను మోసం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘాల నాయకులు దీపాల సత్యనారాయణ, బట్టు నాగమల్లేశ్వరరావు, కొడాలి రామకోటేశ్వరరావు, కె వీర మోహనరావు, కౌవుతరపు పార్థసారథి, వంగర శ్రీనివాసరావు, ప్రజా సంఘాల నాయకులు పి మనోజ్, జి సుధాకర్, జి నాగరాజు పాల్గొన్నారు.


ధర్నా నిర్వహిస్తున్న చేనేత కార్మిక నాయకులు

చీరాల : మగ్గం గుంటల్లో నీళ్లు చేరి, పడుగులు తడిసి ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరుతూ మండలంలోని రామకృష్ణాపురంకు చెందిన చేనేత కార్మికులు గురువారం తహశీల్దారు కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి మండ సత్యనారాయణ, చేనేత కార్మికులు ఉన్నారు.


యానది కాలనీలో పరామర్శిస్తున్న సిపిఎం నాయకులు

నష్టపోయిన పేదలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కారంచేడు

కారంచేడులో వరద ముంపుకు గురైన యానాది కాలనీ వాసులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం నాయకులు పి కొండయ్య డిమాండ్ చేశారు. గ్రామంలోని ఆర్‌సిఎం చర్చి వద్ద గల యానాది కాలనీ పూర్తిగా నీటిలో మునిగిపోయిందని అన్నారు. గత మూడు రోజులగా కురుస్తున్న భారీ వర్షాలు వరదలకు మూడు గృహాలు పూర్తిగా ముంపుకు గురయ్యాయని తెలిపారు. మరికొన్ని గృహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని తెలిపారు. ఇప్పటికీ కాలనీలో నీరు నిలిచి ఉందని అన్నారు. ప్రభుత్వం కాలనీలో వర్షానికి పాడైన రోడ్లను వెంటనే వేయించాలని, కూలిన ఇళ్లకు, పాక్షికంగా దెబ్బతిన్న ఇళ్ల కుటుంబాలకు పునరావాసం ఏర్పర్చుకోవడానికి ఆర్థిక సహాయం చేయాలని కోరారు. అధికారులు వెంటనే స్పందించి నిరుపేదలైన యానాదులను ఆదుకోవాలని కోరారు. కాలనీలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని పరిశీలించారు.

పంట నష్టాన్ని ప్రభుత్వం భర్తీ చేస్తుంది

ప్రజాశక్తి - వేటపాలెం

తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని శాసన సభ్యులు కొండయ్య పేర్కొన్నారు. మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయితీ కొత్తపాలెం కాలవ కట్ట వద్ద నీట మునిగిన పొలాలను ఆయన గురువవారం పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలు తెలుసుకున్నారు. పంట తీవ్రంగా దెబ్బతిన్నాయని రైతులు తెలిపారు. పంట నష్టం వివరాలు త్వరితగతిన సేకరించాలని అధికారులకు ఆదేశించారు. ప్రభుత్వం రైతు బాదలు అర్థం చేసుకుంటుందని, సహాయం అందించే వరకు తాను పర్యవేక్షిస్తానని తెలిపారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ కొండయ్య


భోజనాలు అందజేస్తున్న దృశ్యం

వలస కూలీలకు భోజనాలు పంపిణీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని కొమ్మాలపాడు గ్రామానికి వలస వచ్చిన 50 మంది కూలీలకు పునరావాస కేంద్రంలో గ్రామానికి చెందిన కూటమి నేతలు కాలేషా గారి బుజ్జి, చెన్నుపల్లి నాగూర్, మన్నేపల్లి హసన్, గోకలకొండ గోరా భోజనాలను అందజేశారు. దాతలకు కూలీలు కృతజ్ఞతలు తెలిపారు.

కారు దిగి..స్కూటీ ఎక్కి..

చేనేతపురి కాలనీలో ఎమ్మెల్యే కొండయ్య పర్యటన

ప్రజాశక్తి-చీరాల

తుఫాను ప్రభావంతో చేనేతపురి కాలనీ నీట ముగిపోయింది. గుంట మగ్గాల్లో నీరు చేరి.. చేనేత కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్న విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఎంఎం.కొండయ్య పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి మహేంద్రనాథ్‌తో కలిసి చేనేతపురి కాలనీకి చేరుకున్నారు. కాలనీలోకి కారులో కాకుండా స్కూటీపై ఎక్కి తిరుగుతూ.. అక్కడ నేతన్నల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గుంట మగ్గాల్లో నీరు చేరటంతో బాధితుల వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. రామకృష్ణాపురంలో పర్యటించి అక్కడి ప్రజల సమస్యల తెలుసుకున్నారు.



స్కూటీపై చేనేతపురి కాలనీకి వెళుతున్న ఎమ్మెల్యే కొండయ్య

వరద నీటిలోనే నవోదయ విద్యాలయం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మొంథా తుఫాన్ గండం గట్టెక్కినప్పటికీ, ఆ ఆనవాళు ఇంకా మిగిలే ఉన్నాయి. తుఫాన్ కారణంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, నవోదయ విద్యాలయం, ఆంధ్రకేసరి విశ్వావిద్యాలయం, దామచర్ల సక్కుబాయమ్మ మహిళా డిగ్రీ కాలేజీ వంటి విద్యా సంస్థలు నీటమునిగిన సంగతి విదితమే. కాగా గురువారం నాడు వరద నీటి ప్రభావం తగ్గినప్పటికీ.. వరద వల్ల ఏర్పడిన మురుగు ఆయా విద్యా సంస్థల తరగతులు, కార్యాలయంలో పేరుకు పోయి ఉంది. సిబ్బంది గదుల్లో నీటిని బయటకు తోడే ప్రయత్నం లో ఉన్నారు. ఎంత తోడినప్పటికి మురుగు తొలగి పోవడానికి మరో వారం రోజులు పట్టనున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు. కాగా గురువారం కూడా ఏకెయు నవోదయ విద్యాలయంకు సెలవు ప్రకటించారు.



నవోదయ క్లాస్‌రూమ్‌లోకి చేరిన వర్షపునీరు

తుపాన్ బాధితులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

తుపాన్ ముంపుతో ఇబ్బంది పడుతున్న ప్రజలకు శివం ఫౌండేషన్ అండగా నిలిచింది. గురువారం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో నెహ్రూ కాలనీ పరిసరాల్లో బాధితులకు అన్నదానం, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒంగోలు నగర అభివద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు మాట్లాడుతూ ముంపు కారణంగా ఇళ్లలో చిక్కుకున్న కుటుంబాలకు శివం ఫౌండేషన్ నిరంతర సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో చెరుకూరి ఆదిలక్ష్మి, దన్నారపు మస్తాన్రావు, కష్ణవేణి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి

డిఎంహెచ్ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తుపాన్ కారణంగా కురిసిన భారీ వర్షాలతో వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని వైద్య, ఆరోగ్య సిబ్బందిని డిఎం,హెచ్ఒ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఒంగోలు నగరంలోని పునరావాస కేంద్రాలను జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి గురువారం పరిశీలించారు. తొలుత డిఎం,హెచ్ఒ కరుణా కాలనీ, పాపా కాలనీ, మోటూరి ఉదయం కాలనీ, మదర్ థెరిస్సా కాలనీ, భగత్ సింగ్ కాలనీ, బిలాల్ నగర్, ప్రగతి కాలనీ వంటి కేంద్రాలను పరిశీలించి అక్కడ వైద్య శిబిరాలను సందర్శించారు. ప్రజలకు వర్షా కాలంలో వచ్చే వ్యాధులు, తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య విస్తరణ , మీడియా అధికారి బెల్లం నరసింహా రావు, హెల్త్ అసిస్టెంట్ బ్రహ్మయ్య, ఎస్‌కె మస్తాన్ బీ, కవిత, విజయలక్ష్మి, దుర్గా పాల్గొన్నారు.

అంధుల పాఠశాలకు చేయూత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అంధులకు ప్రత్యేక ప్రతిభాపాటవాలు ఉంటాయని వారి పునరావాసానికి తమ వంతు చేయూతనందిస్తామని రిలయబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ తుపాకుల రవి తెలిపారు. ఒంగోలు నగరంలో నిర్వహిస్తున్న గుడ్ న్యూస్ అందుల పాఠశాల లోని చిన్నారులకు రెండు లక్షల విలువైన నిత్యావసర సరుకులను ఆయన పంపిణీ చేశారు. ఒంగోలు పట్టణంలో అంధుల పాఠశాలను నిర్వహిస్తున్న మోహనరావును ఆయన అభినందించారు.



చిన్నారులకు సరుకులు అందజేస్తున్న దృశ్యం

తుపాన్ బాధితుల కోసం ఉల్లి, బంగాళాదుంపలు సిద్ధం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మొంథా తుఫాన్ ప్రభావానికి గురైన ప్రకాశం జిల్లాలోని మత్స్యకారులు, నేతలు మరియు పునరావాస కేంద్రాల్లో నివసిస్తున్న బాధిత కుటుంబాలకు ఉల్లిపాయలు, బంగాళాదుంపలు పంపిణీ చేయడానికి చర్యలు చేపట్టినట్లు మార్కెటింగ్ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం వరలక్ష్మి గురువారం రాత్రి తెలిపారు. మార్కెటింగ్ విభాగం ఆధ్వర్యంలో మొత్తం 8,000 కుటుంబాలకు ఉల్లిపాయలు మరియు బంగాళాదుంపలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. మత్స్యకార గ్రామాలు, నేత వత్తి కుటుంబాలు, అలాగే పునరావాస కేంద్రాల్లో తాత్కాలికంగా ఉన్న బాధితులు ఈ సహాయం పొందుతారని తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో

పునరావాస చర్యలు వేగవంతం చేయాలి

సిపిఎం డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మొంథా తుఫాను బీభత్సంతో ముంపుకు గురైన కాలనీల్లో ప్రజల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందని సిపిఎం నగర నాయకత్వ బృందం పేర్కొంది. గురువారం నాడు నగరంలో పలు పునరావాస కేంద్రాలు, ముంపు ప్రాంతాలను సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యుడు తాంబి శ్రీనివాసులు, నగర నాయకులు ఎస్ డి హుస్సేన్, టి. మహేష్ తదితరులు పర్యటించారు. తొలుత వెంకటేశ్వర కాలనీని సందర్శించి అక్కడ పరిస్థితులను పరిశీలించింది. ఇప్పటికీ కాలనీలో నీరు నిలిచి ఉండటం, చెట్లు విరిగిపడటం వంటి సమస్యలు కనిపించాయని వారు తెలిపారు. విరిగిన చెట్లను వెంటనే తొలగించాల్సిన అవసరం ఉందని, వరదనీటి ప్రవాహం వల్ల మట్టి చేరడంతో ప్రజలు ఇంకా సాధారణ జీవనానికి చేరుకోలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తదుపరి చైతన్య కాలనీలో ప్రజలతో మాట్లాడారు. రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని, గుంతలు పడి ప్రజలు నడవడానికి కూడా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. తాత్కాలికంగా అయినా రోడ్లను మరమ్మతు చేసి గుంతలను పూడ్చాలని అధికారులను కోరారు. మదర్ థెరిస్సా కాలనీలో పరిస్థితి మరింత దారుణంగా ఉందని సిపిఎం బందం తెలిపింది. అక్కడ నీరు ఇంకా తగ్గకపోవడంతో అనేక కుటుంబాలు ఇళ్లలో ఉండలేక పునరావాస కేంద్రాలకు వెళ్లినట్లు నాయకులు తెలిపారు. ఆ ప్రాంత ప్రజలకు ఆహారం, తాగునీటి సరఫరా తక్షణం అందించాలని డిమాండ్ చేశారు. కనీసం నడవడానికి కూడా దారులు లేకపోవడం వల్ల ప్రజలు ఇక్కట్లు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తదుపరి ప్రగతి కాలనీ, అరవ కాలనీ, అశోక్ నగర్, దత్తాత్రేయ కాలనీ, బాలాజీ నగర్ ప్రాంతాల్లో సందర్శించి, ఆ కాలనీల్లో ఇళ్లలోకి నీళ్లు చొచ్చుకుపోయాయని, అక్కడి బాధిత కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని వారు కోరారు. అరవ కాలనీలో కార్మిక శాఖ అధికారులు పరిశీలనకు వచ్చిన సందర్భంగా సిపిఎం నాయకులు కూలీల సమస్యలను ప్రస్తావించారు. కోప్పోలు రోడ్, ఇందిరమ్మ కాలనీ, మోటూరు ఉదయం కాలనీ, ఎన్‌టిఆర్ కాలనీ, పాపా కాలనీ, బిలాల్ నగర్ ప్రాంతాల్లో మురుగునీరు నిలిచి ఉండటం, రహదారులు పూర్తిగా దెబ్బతినటం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నగరంలో సుమారు 25 కాలనీలలో లక్ష మంది పేద ప్రజలు నివసిస్తున్నారని, వీరందరూ తుఫాను ప్రభావంతో పనులు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారని వారు తెలిపారు. లైలా తుఫాన్ కంటే ఈసారి నష్టం ఎక్కువగా జరిగిందన్నారు. ఒక్కరోజులోనే 29.5 శాతం వర్షపాతం నమోదైందని ప్రభుత్వం తక్షణమే ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి సహాయాన్ని అందించాలని సిపిఎం నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు.



కాలనీల్లో సమస్యలను తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

శ్రీలక్ష్మి సేవలు స్ఫూర్తిదాయకం..

- కేన్సర్‌పై అవగాహన అవసరం..
- శ్రీలక్ష్మి సంతాప సభలో పలువురు వక్తలు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

సాధారణ ఉద్యోగిగా పనిచేస్తూ సమాజ హితంకోసం తుదివరకు శ్రమించిన రాయపాటి శ్రీలక్ష్మి అందరికీ స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు కొనియాడారు. జవహర్ నవోదయ విద్యాలయ జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు సతీమణి శ్రీలక్ష్మి వర్ధంతి సభ గురువారం నాడు స్థానిక గద్దలగుంట వారాహి నిలయంలో జరిగింది. యుటిఎఫ్ నాయకులు ఎస్.రవి అధ్యక్షతన జరిగిన ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, మాజీ శాసనమండలి సభ్యులు వి.బాలసుబ్రమణ్యం, యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కెమాబు, కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ కె అబ్దుల్ హై పలువురు ఉపాధ్యాయ నేతలు, పలువురు ప్రముఖులు శ్రీలక్ష్మికి ఘనంగా నివాళులర్పించారు డివి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు. వీరాంజనేయులు, వారి కుటుంబానికి యుటిఎఫ్, సిపిఎం అండగా నిలుస్తుందని ప్రకటించారు. శ్రీలక్ష్మి కేన్సర్‌తో మృతిచెందారని, కేన్సర్ మహమ్మారిని ఎదుర్కొనేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని వక్తలు ప్రకటించారు.

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ సాధారణ ఉద్యోగిగా అంకిత భావంతో పనిచేసి, కుటుంబ భాధ్యతలు సమర్ధవంతంగా నిర్వహించిన శ్రీలక్ష్మి చిరస్మరణీయురాలని కొనియాడారు. యుటిఎఫ్ ఉద్యమంలో వీరాంజనేయులు పని చేసేందుకు తోడ్పాటు నిచ్చిన శ్రీలక్ష్మి వ్యక్తిత్వం శ్లాఘనీయమన్నారు. వీరాంజనేయులు కుటుంబానికి తమ పార్టీ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. వారి కుటుంబానికి రాష్ట్ర కమిటీ తరపున సంతాపం తెలుపుతున్నట్లు ప్రకటించారు.



మాట్లాడుతున్న విఠపు బాలసుబ్రమణ్యం

శాసనమండలి మాజీ సభ్యులు వి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ జాతీయ స్థాయి విద్యాసంస్థలో సాధారణ ఉద్యోగి మూడు దశాబ్దాల పాటు కీలక భూమిక పోషించడం అరుదైన అంశమని, ఆ ఘనత శ్రీలక్ష్మికి దక్కిందన్నారు. నవోదయతో తమకు, యుటిఎఫ కు అనుబంధం ఏర్పడటానికి మూలం శ్రీలక్ష్మి అని గుర్తు చేసుకున్నారు. లైలా తుఫాన్ సందర్భంలో పీజీ సెంటర్ వివాదంలోనూ, వరద ముంపు నివారణలో ఆమె చొరవ చూపి సమస్యను తమతో చర్చించి కలెక్టర్ ద్వారా పరిష్కారం చూపేందుకు దోహదపడ్డారని గుర్తు చేశారు. డివి ఉద్యమంలో చురుగ్గా పాల్గొనడంలో శ్రీలక్ష్మి తోడ్పాటు ఉందన్నారు.

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు మాట్లాడుతూ శ్రీలక్ష్మి నవోదయ విద్యాలయంకు ఐకాన్‌గా పేర్కొన్నారు. వందలాది మంది విద్యార్థిని విద్యార్థులకు దిశా నిర్దేశం చేసిన వ్యక్తిగా ముద్రపడిన ఆమె మరణం నవోదయ విద్యాలయం కు తీరని లోటుగా పేర్కొన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్ కె మాబు మాట్లాడుతూ శ్రీలక్ష్మి వామపక్ష ఉద్యమానికి తోడ్పాటును అందించారన్నారు. వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందని ప్రకటించారు.

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పూనాటి ఆంజనేయులు మాట్లాడుతూ శ్రీలక్ష్మి మతికి కారణమయిన కేన్సర్ నివారణ చర్యలు చేపట్టవలసిన భాద్యత ప్రభుత్వానిదని, కేన్సర్‌ను గుర్తించేందుకు, నివారించేందుకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ మహమ్మారి పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, దీనికి ప్రభుత్వంపై వత్తిడి తెచ్చేందుకు కషి చేసినప్పుడే శ్రీలక్ష్మి కి అర్పించే ఘన నివాళిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎస్ రవి, తాటి పోతులూరయ్య మాట్లాడారు. సభలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జి శేషయ్య, యుటిఎఫ్ ఆడిట్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఒ వీరారెడ్డి, జిల్లా కార్యదర్శి టి రమణారెడ్డి, జెవివి రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్ జయప్రకాశ్, జిల్లా అధ్యక్షులు యు వెంకట్రావు పాల్గొన్నారు.

డిఇఒ కిరణ్‌కుమార్ పరామర్శ..

యుటిఎఫ్ నాయకులు డి.వీరాంజనేయులును జిల్లా విద్యా శాఖాధికారి ఎ కిరణ్ కుమార్ వారి నివాసం వద్ద ఆయనను పరామర్శించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. శ్రీలక్ష్మి చిత్రపటం వద్ద నివాళులర్పించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.


చేనేతలతో మాట్లాడుతున్న బీరక సురేంద్ర

చేనేతలను ఆదుకోవాలి

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని దేశాయిపేట పంచాయతీ విఘ్నేశ్వర కాలనీ, న్యూ కెపాల్, జగనన్న కాలనీలను దేవాంగ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బీరక సురేంద్ర గురువారం సందర్శించారు. తుఫాను బాధితులతో మాట్లాడారు. వారి సమస్యలు తెలుసుకున్నారు. నీట మునిగిన ప్రాంతాల్లో వెంటనే నీటిని తొలగించాలని కోరారు. మూడు రోజులుగా కరెంట్ లేక ఆయా కాలనీల్లో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని అధికారులకు తెలిపారు. నీట మునిగిన మగ్గాలు, తడిసిన నూలు, పేక, పనిముట్లు పనికిరావని అన్నారు. ప్రతి మగ్గం పునరుద్ధరణకు కనీసం రూ.25 వేలు ఖర్చవుతుందని తెలిపారు. విపత్తు నిర్వహణ నిధుల నుంచి ప్రతి చేనేత కుటుంబానికి రూ.25వేలు సహాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఎం చంద్రబాబు చేనేత దినోత్సవం రోజున రూ.25వేలు ఇస్తామన్న హామీ అమలు కాలేదని అన్నారు. పన్నెం వెంకట సుబ్బారావు, బీరక సురేష్, పన్నెం మల్లి, పరమేశ్వరరావు, శ్రీనివాసరావు, ఆంజనేయులు, సాంబశివుడు, రంగారెడ్డి, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


చెక్ డాంను పరిశీలిస్తున్న ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

చెక్ డ్యాం పరిశీలన

ప్రజాశక్తి - పంగులూరు

2009 – 2010లో నిర్మించిన చెక్ డ్యాంను, చెక్ వాల్స్‌ను, వాటర్ షెడ్ ప్రోగ్రాంను, చిన్న నీటి కుంటలను ఎన్ఐఆర్‌డి తరపున ఈ టీసీ వాటర్ షెడ్ సిబ్బంది గురువారం పరిశీలించారు. మండలంలోని తూర్పు తక్కెళ్ళపాడులో నిర్మించిన ఈ పథకాల గురించి, వాటి ప్రాముఖ్యత గురించి ఎన్ఐఆర్డి ట్రైనర్స్ రైతులకు వివరించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి అభిప్రాయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎపిడి సింగయ్య, ఎపిఒ సంతోషం, ఉపాధి, డ్వామా సిబ్బంది పాల్గొన్నారు.

నీట మునిగిన పొగాకు మండెలు

ప్రజాశక్తి - పర్చూరు

మండలంలోని కొల్లావారిపాలెంకు చెందిన అడ్డగడ సుబ్బారావు 8 ఎకరాల్లో నల్లబర్లి పొగాకు సాగు చేశారు. 8 ఎకరాల్లోని 120 పొగాకు మండెలుగా వేసి చేలోనే ఉంచారు. తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు పొగాకు తడిచింది. అడుగు పొగాకు అంతా దెబ్బతిన్నదని సుబ్బారావు ప్రజాశక్తికి తెలిపారు. ఈ రైతు తోపాటు బంధు అంకమ్మ రెండెకరాల్లో 20 క్వింటాళ్ల పొగాకు చేలోనే మండవేసి పరదాలు కప్పి జాగ్రత్తపర్చినప్పటికీ వరద నీళ్ల ప్రవహించటంతో అడుగు పొగాకు అంత దెబ్బతిందని వివరించారు. పెద్దివారిపాలెంకు చెందిన మరొక పొగాకు రైతు అమృతలూరి అఖిల్ ఐదెకరాల్లో సాగుచేసిన 40 కింటాళ్ల పొగాకు నీటిపాలైందని వాపోయాడు.

బీచ్ వద్దకు అనుమతి లేదు..

ప్రజాశక్తి - బాపట్ల

ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నందున అధికారులు ప్రకటించే వరకు సూర్యలంక బీచ్‌కు పర్యాటకలను అనుమతి లేదని మెరైన్ పోలీసులు గురువారం ప్రకటించారు. అలలు ఎగసి పడుతున్నాయని తెలిపారు. కార్తీక మాసం సందర్భంగా సముద్ర తీరానికి విచ్చేసే సందర్శకులు, పర్యాటకుల భద్రత దృష్ట్యా సముద్ర స్నానాలు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు మెరైన్ ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు. అధికారులు ప్రకటించే వరకు బీచ్‌కు రావద్దని తెలిపారు.

ప్రతి రైతుకూ నష్ట పరిహారం అందిస్తాం..

పంటల పరిశీలనలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - పంగులూరు

తుపాను కారణంగా పంటలు నష్టపోయిన ప్రతి రైతుకు నష్టపరిహారం అందిస్తామని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని బూదవాడ, కోటపాడు, కొండమూరు గ్రామాల్లో నష్టపోయిన పంటలను ఆయన గురువారం పరిశీలించారు. బూదవాడలోని ధనలక్ష్మి కాలనీలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలించారు. చెరువుకట్టు బలహీనంగా ఉందని స్థానికులు చెప్పడంతో కట్ట పటిష్టంగా నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఇళ్ల మధ్య నిలిచిన నీటిని త్వరగా బయటికి పంపించే చర్యలు చేపట్టాలని అన్నారు. దెబ్బతిన్న మినుము, మొక్కజొన్న పంటలు పరిశీలించారు. మండలంలో సాగైన విస్తీర్ణం, ఈకేవైసీ, ఈ క్రాపు చేయించిన వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈకేవైసీ విషయమై అధికారులు జాగ్రత్తలు తీసుకొని


మినుము పరిశీలిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

రైతులెవరికీ నష్టం జరగకుండా చూడాలని కోరారు. ఎవరైనా ఈకేవైసీ చేయించుకోకపోతే అధికారులే సరిద్ది రైతులకు న్యాయం జరిగే విధంగా చూడాలని అన్నారు. రైతులెవరు తమకు అన్యాయం జరిగిందని అనకూడదని అధికారులను ఆదేశించారు. రైతులెవరైనా అన్యాయం జరిగిందంటే అందుకు అధికారులదే బాధ్యతని అన్నారు. బాధ్యతారహితంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని అన్నారు. తుఫాను కారణంగా పడిపోయిన కోటపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నిర్మించడానికి అంచనాలు తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. కొండమూరులో మినుము పైరు పరిశీలించారు. కార్యక్రమంలో తహశీల్దారు పి సింగారావు, ఎంపిడిఒ కె స్వరూపరాణి, ఎఒ సుబ్బారెడ్డి, విద్యుత్ ఈఈ మస్తానరావు, డిఈ దామోదరం, ఈఓఆర్డి సుమంత్, పంచాయతీరాజ్ ఎఇ హనుమంతరావు, టిడిపి అధ్యక్షుడు రావూరి రమేష్ బాబు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, గుదిబండ్ల ఆదిరెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, చిలుకూరి వెంకటేశ్వర్లు, పిఎసిఎస్ అధ్యక్షులు అలవల రామిరెడ్డి, అల్లంనేని బ్రహ్మానంద స్వామి, బత్తుల వెంకటరావు, రావుల సింగరకొండ, గడ్డం నాగేశ్వరరావు, కాటా అంజయ్య, మక్కెన ఆంజనేయులు, ఉన్నం రవి, మురకొండ సుబ్బారావు, గొట్టిపాటి కాజాస్వామి, గుడిపాటి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలో మొంథా తుఫాన్ ప్రభావంతో ఈనెల 28న కురిసిన భారీ వర్షాలకు ఉద్యాన పంటలైన మిరప, బొప్పాయి, అరటి, కూరగాయల పంటలను మార్టూరు ఉద్యాన అధికారి బి హనుమంత్ నాయక్ కొప్పరం, అడవిపాలెం గ్రామాల్లో రైతులతో కలిసి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో ఉద్యానవన సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మార్టూరు రూరల్ : మొంథా తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన ఉద్యాన పంటలను ఉధ్యానవన అధికారి బి హనుమంత్ నాయక్ సిబ్బందితో పరిశీలించారు. తోటల్లో ఎక్కడైనా నీరు నిలబడి ఉంటే 48 గంటల్లోపు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మిరప, అరటి, బొప్పాయి, కూరగాయల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

అద్దంకి : పంట నష్ట నివారణ చర్యలు చేపట్టాలని ఎడికె బి ఎఫ్రాయిం రైతులకు సూచించారు. అద్దంకి, కలవకూరు, శంఖవరప్పాడు, ధర్మవరం గ్రామాల్లో దెబ్బతిన్న పొలాలు ఎఒ కొర్రపాటి వెంకటకృష్ణతో కలిసి పరిశీలించారు. ఇంకా పొలాల్లో నీరు నిల్వ ఉన్నదని, వెంటనే తీసివేయాలని సూచించారు. మొక్కజొన్న కోత దశలో ఉన్నందున నీరు వెల్లగట్టాలని చెప్పారు.


రైతులతో మాట్లాడుతున్న బి హనుమంత్ నాయక్

ఇంకొల్లు : మండలంలోని పావులూరులో మొక్కజొన్న, ప్రతి, మినుము పైర్లను శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. బాపట్ల ప్రాంతీయ పరిశోధన స్థానం శాస్త్రవేత్త టి హరిత, డాట్స్ సెంటర్ కో ఆర్డినేటర్ కె అచ్యుతరావు, గుంటూరు కృషి విజ్ఞాన కేంద్రం కీటకాల శాస్త్రవేత్త సిహెచ్ అనిల్ కుమార్ ప్రతి, మినుము, మొక్కజొన్న పైర్లను సందర్శించి సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎఒ, విఎఎ వై ధీరజ్, అలెగ్జాండర్, మౌన, వనజ, రైతులు హనుమయ్య, కిషోర్ పాల్గొన్నారు.

వేటపాలెం : మండలంలోని పాపాయిపాలెం, దేశాయి పేట గ్రామాల్లో తుఫాను ప్రభావంతో నీట మునిగిన వరి, వేరుశనగ పొలాలను లాం ఫాం శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. పంటల్లో నిల్వ నీటిని తొలగించాలని చెప్పారు. డాక్టర్ సంపత్‌కుమార్, కీటక శాస్త్రవేత్త డాక్టర్ కామాక్షి, చీరాల ఎడిఎ టి రత్నకుమారి, ఎఒ ఎం సరిత, ఎఇఒ కె రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కుళాయికి అక్రమంగా మోటార్ ఏర్పాటు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పదిమందికి త్రాగునీరు అందించాలనే దృక్పథంతో పంచాయతీలో ఏర్పాటు చేస్తున్న వీధి కుళాయిలకు కొందరు స్వార్థపరులు విద్యుత్ మోటార్లను బిగించు కొని గ్రామ ప్రజలకు త్రాగునీరు అందకుండా చేస్తు న్నారు. మండలంలోని కోనేటిపురం జగనన్న కాలనీలో రహదారులు, పూర్తి స్థాయిలో త్రాగునీటి వసతి అందుబాటులో లేదు. రహదారులు లేకపోవ డంతో అధిక వర్షాలకు కాలనీ పూర్తిగా నీరు చేరి మోకాటి లోతు నీళ్లు నిలిచాయి. ఆ నీటిలో గడ్డి పెరిగి ప్రజలకు తీవ్ర అసౌకర్యంగా మారింది. అయితే పంచాయతీ అధికారులు కాలనీలో అక్కడక్కడ ఏర్పాటు చేసిన త్రాగునీటి కొళాయిలకు కొందరు విద్యుత్ మోటార్లు బిగించుకొని ఆ నీటిని అక్రమంగా వినియోగిస్తున్నారు. దీంతో మిగిలిన వారికి త్రాగునీరు అందే పరిస్థితి దూరమైంది. విషయాన్ని సంబంధిత పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారుల దృష్టి సారించి అక్రమంగా వీధి కొళాయిలకు విద్యుత్ మోటార్లు వినియోగించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

స్వర్ణ గ్రామాన్ని చుట్టుముట్టిన వరద

ప్రజాశక్తి - కారంచేడు

గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు చుట్టు పక్కల వాగులు, వంకలు పొంగి మండలంలోని స్వర్ణ గ్రామాన్ని చుట్టు ముట్టాయి. కారంచేడు, చీరాల రెండు వైపుల నుండి వెళ్లే రహదారులు వరదతో మూసుకుపోయాయి. ఇప్పటిదాకా చేసిన కష్టం వరద పాలైందని కౌలు రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. పర్చూరు వాగు, కప్పల వాగు, ఆలేరు, మొండి వాగు పొంగి పొలాల్లోకి పొర్లాయి. స్థానిక సొసైటీ బిల్డింగ్ నుండి యుటిల వరకు ఉన్న మురుగు కాలువ పూడిపోవడంతో కారంచేడు నుండి స్వర్ణ యుటి వరకు కొమ్మమూరు కాల్వ పక్కనగల మురికి నీటి కాల్వకు పారుదల లేకుండా పోయింది. దీంతో ఈ వరద వల్ల నష్టపోవాల్సి వచ్చిందని కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఏడుకొండలు అన్నారు. కారంచేడు, కుంకలమర్రు, స్వర్ణ గ్రామాల్లో సాగు చేసిన వేలాది ఎకరాలు వరి నారు, నాట్లు వేసి వరి, ఎరువులకు పెట్టిన పెట్టుబడి అంతా నీటి పాలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నష్టపోయిన కౌలు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి కొండయ్య కోరారు. నష్టాన్ని అంచనా వేసి రైతులందరినీ ఆదుకోవాలని డిమాండ్ చేశారు.


ఆశీర్వదిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

వధూవరులకు మంత్రి ఆశీర్వాదం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలోని 4వ వార్డు నివాసులు గార్లపాటి శ్రీనివాసరావు, రాధారాణి దంపతుల కుమారుడు హేమ సాయికృష్ణ, మణిహారిక వివాహ వేడుకకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించి హృద యపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

నష్టపోయిన రైతులకు పరామర్శ

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని కొండమూరులో తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఎపి కిసాన్ రాష్ట్ర అధ్యక్షుడు చిగురుపాటి కుమార్ స్వామి పరామర్శించారు. పంట నష్టంపై ప్రాథమిక అంచనాను కేంద్రప్రభుత్వానికి పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో పర్చూరు శ్రీనివాసరావు, రామకృష్ణ, జాగర్లమూడి యల్లమందరావు, మంగమూరి సురేష్, కొల్లి కోటేశ్వరావు, అంజిరెడ్డి, కోటిరెడ్డి, భాస్కరరెడ్డి, నారపురెడ్డి పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణ శివారు కలవకూరు రోడ్డులో వైఎస్ఆర్ అపార్ట్మెంట్ ఎదురుగా బడ్డీ కొట్టు నిర్వహించుకున్న గురువమ్మతో ద్వచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి మాటలు కలిపారు. మాట్లాడుతూ ఒక్కసారిగా ఆమె మెడలోని బంగారు గొలుసు దొంగిలించాలనే ప్రయత్నం చేశారు. ఆమె కేకలు వేయడంతో చుట్టుప్రక్కల వారు అక్కడకు చేరుకున్నారు. దీంతో ద్విచక్ర వాహనంపై వచ్చిన వ్యక్తి వేగంగా పరారయ్యాడు. ఈ ఘటనను అటుగా వెళ్లే వ్యక్తులు ఫోటో లు తీశారు. పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

విశ్రాంత ఉద్యోగి మృతి

ప్రజాశక్తి - అద్దంకి


నాగ బ్రహ్మచారి (ఫైల్)

అనారోగ్యంతో విశ్రాంత బ్యాంకు ఉద్యోగి గుండ్లకమ్మ నదిలో గల్లంతైట్లు స్థానిక ప్రజలు గుర్తించారు. పట్టణంలో నివాసముండే ఎం నాగ బ్రహ్మాచారి గత కొంత కాలం నుండి అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ క్రమంలో గురువారం గుండ్లకమ్మ నది వద్దకు వచ్చి ఒక చెప్పును బ్రిడ్జిపై ఉంచి స్థానికులు చూస్తున్న సమయంలోనే బ్రిడ్జిపై నుండి నీటిలోకి దూకినట్లు స్థానికులు చెబుతున్నారు. అతని కోసం కుటుంబ సభ్యులు వెతుకులాట ప్రారంభించినట్లు తెలిపారు. ఘటనపై పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య

రైతులకు అండగా ఉంటాం ఎమ్మెల్యే కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

తుఫాన్ ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతుల పట్ల ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య తెలిపారు. మండలంలోని కొత్తపాలెం కాలవ కట్ట వద్దకు చేరుకుని వరద నీటితో మునిగిపోయిన పంట పొలాలు స్వయంగా పరిశీలించారు. రైతులు ఆవేదన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ఎంత నష్టం జరిగిందో అధికారులు తక్షణమే అంచనా వేస్తున్నారని తెలిపారు. రోశయ్య బ్రిడ్జి సమీపంలో వరద నీటి ప్రవాహానికి అడ్డుగా నిలిచిన గుర్రపు డెక్క వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఆయన వెంట తహశీల్దారు గోపికృష్ణ, వ్యవసాయ అధికారులు ఉన్నారు.



నిత్యవసర సరుకులు అందజేస్తున్న మహేంద్రనాద్

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

తుఫాన్ ప్రభావంతో రోశయ్య కాలనీలోని బాధితులను టిడిపి అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ గురువారం పరామర్శించారు. కొత్తపేట నాయకులు తన్నీరు ప్రసాద్ ఆధ్వర్యంలో కాలనీలో బాధితులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకుల గూడూరి శివరాం ప్రసాద్ పాల్గొన్నారు.

వేటపాలెం : తుఫాన్ ప్రభావంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు అండగా నిలుస్తామని టిడిపి అధికార ప్రతినిధి మద్దులూరి మహేంద్రనాథ్ తెలిపారు. మండలంలోని అక్కయ్యపాలెం పరిధిలోని రోశయ్య కాలనీలో ఆయన గురువారం పర్యటించారు. తుఫాన్ బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.



అవార్డ్స్ ఉత్సవంలో గీత చైర్మన్ వలేటి మురళి కృష్ణ

ఘనంగా ఆవిష్కార్ అవార్డ్స్ ఉత్సవం

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచాల్సిన అవసరం ఉందని నేషనల్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎన్ఆర్‌డిసి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కమోడోర్ విశ్రాంత ఉద్యోగి అమిత్ రస్తోగి అన్నారు. ఢిల్లీలో గీత యంగ్ సైంటిస్ట్ అవిష్కార్ అవార్డ్స్ ఘనంగా నిర్వహించారు. గీత యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రామ్ చైర్మన్ మురళి వలివేటి మాట్లాడుతూ 2022 నుండి దేశానికి 100 ఆవిష్కరణలు అంకితం చేసినట్లు తెలిపారు. డిఎల్డిఎవి మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ అనుపమా సింహ, అటల్ ఇన్నోవాషన్ మిషన్ ఇన్నోవేషన్ లీడ్ సుమన్ పండిట్, డాక్టర్ పకంగు లోంబి, భరత్ పాల్గొన్నారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని వెల్లటూరుకు చెందిన కొలుసు వెంకటేశ్వరరావు (39) అను వ్యక్తి వెల్లటూరు మూడు తూముల పంట కాలువ వద్దకు బహిర్ భూమికి వెళ్ళి ఫిట్స్ రావటంతో ప్రమాదవశాత్తు కాలువలో పడి చనిపోయినట్లు ఎస్ఐ ఎం శివయ్య తెలిపారు. మృతుడు తల్లి కొలుసు వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తాం

మంత్రి అనగాని

ప్రజాశక్తి - రేపల్లె

ప్రభుత్వం ముందస్తు చర్యలు, క్షేత్రస్థాయిలో కూటమి శ్రేణులు, అధికార యంత్రాంగం సత్వర స్పందనతో ఆస్తి, ప్రాణ నష్టం తగ్గిందని మంత్రి అనగాని సత్య ప్రసాద్ అన్నారు. మొంథా తుఫాను అనంతరం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. తుఫాను హెచ్చరికలు వెలువడిన వెంటనే ప్రభుత్వం దృష్టి సారించి ప్రజల భద్రత లక్ష్యంగా అధికార యంత్రంగాన్ని అప్రమత్తం చేసిందని అన్నారు. తుఫాను ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడకూడదని ప్రత్యేక సిబ్బందిని నియమించి రక్షణ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కష్ట కాలంలో ప్రజల వెంటే నిలవాలని సంకల్పంతో కూటమి శ్రేణులు, అధికారులు విశేషంగా పని చేశారని అభినందించారు. విపత్కర పరిస్థితుల్లో అవసరమైన సామాగ్రి, ట్రాక్టర్లు, కట్టర్లు, ఇన్వర్టర్లు, జనరేటర్లు, జెసిబిలు సిద్ధం చేసుకుని క్షేత్రస్థాయిలో తీర ప్రాంతం వెంట అధికారులు మోహరించి పహారా కాసారని తెలిపారు. లోతట్టు ప్రాంతాలు గుర్తించి ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారని అన్నారు. వృద్ధులు, వికలాంగులు, గర్భిణీ స్త్రీల పట్ల ప్రత్యేక శ్రద్ధతో సురక్షిత ప్రాంతాల్లో ఉంచి మందులు అందజేసినట్లు తెలిపారు. తుఫాను సహాయ చర్యల్లో ప్రభుత్వం, యంత్రాంగం విశేష సేవలు చేస్తుంటే ఇంట్లో నుండి బయటకు రాని వైసీపీ శ్రేణులు, బ్లూ మీడియా ఇష్టాను సారంగా మాట్లాడటం సిగ్గుచేటని అన్నారు. ఆస్తి, ప్రాణ నష్టాలు సంభవించకుండా డ్రైనేజీల్లో పూడికతీత పనులు చేయించి, నీటి సరఫరా వేగవంతంగా జరిగేలా చర్యలు చేపట్టామని అన్నారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నారా లోకేష్, ఇతర మంత్రులు తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తూ ప్రజలతో మమేకమై ప్రజల కష్టాల్లో చేదోడువాదోడుగా ఉంటూ సహాయ సహకారాలు అందిస్తుంటే వైసీపీ శ్రేణులు విమర్శలు చేయడం తగదని అన్నారు. రైతుల చిరునవ్వే కూటమి ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. నష్టపోయిన ప్రతి రైతును ఆదుకుంటామని అన్నారు. హెక్టారుకు రూ.25 వేలు చెల్లించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. పునరావస కేంద్రాల్లో మూడు రోజులున్నవారికి ఆర్థిక సహాయంతో పాటు, నిత్యవసర వస్తువులు అందజేస్తున్నామని అన్నారు. తుఫాను తీవ్రతకు ఇల్లు కోల్పోయిన బాధితులకు ఇళ్ల నిర్మించుకునేందుకు ప్రభుత్వం సహాయం అందించేలా చర్యలు చేపట్టిందని అన్నారు. మత్స్యకారులకు అదనపు సహాయం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గూడపాటి శ్రీనివాసరావు, కృష్ణ పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ పంతాని మురళీధరరావు, ఆర్డీఓ రామలక్ష్మి, డిఎస్పి శ్రీనివాసరావు, కమిషనర్ సాంబశివరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అనగాని సత్యప్రసాద్

మాలపల్లి చెరువు నీటిని తొలగించాలి

ప్రజాశక్తి - పంగులూరు

మండలంలోని నూజిలపల్లిలోని మాలపల్లి చెరువులో తుఫాను కారణంగా వచ్చిన నీటిని తొలగించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు డిమాండ్ చేశారు. మాలపల్లి చెరువును గురువారం ఆయన సందర్శించారు. చెరువు చిన్నదైనప్పటికీ ఆ చెరువును ఆనుకుని ఉన్న ఐదెకరాల భూమి వర్షం కారణంగా నీటితో మునిగిపోయిందని తెలిపారు. అందులో సాగుచేసిన బంతిపూల పంట పూర్తిగా మునిగిపోయి పనికిరాకుండా పోయిందని అన్నారు. వర్షం కారణంగా నీరు ఈ చెరువు మీదకు రావటంతో నీరు కాలనీవాసుల ఇళ్లను చుట్టుముట్టిందని తెలిపారు. ఈ నీరు ఇప్పట్లో వెళ్లే మార్గం కనిపించడం లేదని అన్నారు. నీరు ఉంటే కాలనీ ఇల్లు దెబ్బతినే ప్రమాదం ఉందని చెప్పారు. కాలనీవాసులు ఆందోళన చెందుతున్నారని కౌలు రైతు సంఘం నాయకులు బెజ్జం రమేష్ అన్నారు. తక్షణమే నీరు బయటకు పంపి శాశ్వత పరిష్కారం చూపాలని రమేష్ కోరారు. కార్యక్రమంలో స్థానికులు విప్పర్ల కోటేశ్వరరావు, డోల ప్రభాకర్, బత్తుల వీరాంజనేయులు, విప్పర్ల మధుబాబు పాల్గొన్నారు.



మాలపల్లి చెరువు పరిశీలిస్తున్న నాయకులు

పోలీసుల సహాయంతో జీవాల తరలింపు

ప్రజాశక్తి - వేమూరు

కృష్ణా నది వరద క్రమంగా పెరగటంతో నది గర్భంలో లంకలోని గొర్రెలను ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ నాగిరెడ్డి చొరవతో సిపిఎం నాయకులు తోడేటి సురేష్, పోలీసుల సహకారంతో పడవల ద్వారా 90 గొర్రెలను బయటకు తరలించారు. కొల్లూరు మండలం చింతల్లంకలో కృష్ణా నదిలో ఈపూరులంకకు చెందిన కైలా పౌలుకు చెందిన జీవాలు మేత కోసం వెళ్ళగా కృష్ణా నదికి అధిక వరద నీరు చేరడంతో రావడానికి చుట్టూ నీరు చేరి చిక్కుకున్నాయి. 90 గొర్రెలను వాటి కాపర్లను పడవల సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేర్చడంతో అధికారులు, ప్రజలు ఊపిరి పిల్చుకున్నారు. ఎస్ఐ అమరవర్ధన్, ఎస్డిఆర్ఎఫ్ సత్యనారాయణ, తహశీల్దారు కె వెంకటేశ్వర్లు ఉన్నారు.

నీట మునిగిన వరి పొలాలు

ప్రజాశక్తి - ఇంకొల్లు

మండలంలోని కడవకుదురు, చింతగుంపల, గొనసపూడి గ్రామాల్లో నీట మునిగిన వరి పొలాలను శాసన సభ్యులు ఏలూరి సాంబశివరావు గురువారం పరిశీలించారు. ఎగువ నుంచి రొంపేరు వాగుకు నీటి ప్రవాహం ఉధృతంగా రావడంతో వాగు కట్టకు గండిపడి పొలాలపై నీళ్లు ప్రవహించాయని రైతులు తెలిపారు. చింతకుంపల వద్ద ఇటీవల కొత్తగా నిర్మాణం చేసిన బీటీ రోడ్డు పరిశీలించారు. పంటలు దెబ్బతిన్న రైతులతో ఆయన మాట్లాడారు.

కొల్లూరు : మండలంలోని దోనేపూడి దిగువున లంక గ్రామాల్లో తుఫానుకు దెబ్బతిన్న పైర్లను శాసన సభ్యులు నక్క ఆనందబాబు గురువారం పరిశీలించారు. ఆర్టికల్చర్, అగ్రికల్చర్ పొలాల్లో దెబ్బతిన్న పైర్లను వెంటనే నమోదు చేసి పంట నష్టం పరిహారం అందే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ, తెలుగు యువత అధికార ప్రతినిధి డాక్టర్ కనగాల మధుసూధన ప్రసాద్, తహశీల్దారు బి వెంకటేశ్వర్లు, ఎంపిడిఒ కె నరసింహారావు పాల్గొన్నారు.

బాపట్ల : మండలంలోని కొండుబొట్లపాలెం పంట కాల్వ కట్టకు గండి పడింది. దీంతో వరిపైరు నీట మునిగింది. రైతులు పలుమార్లు మరమ్మతు చేయాలని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రజా నాయకులు చూచి వెళుతున్నారేతప్ప పరిష్కారం చూపడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పిన్నిబోయిన వారిపాలెం వైపు వందల ఎకరాలకు సాగు నీరు అందించే ఈ కాలువకు పడిన గండి పూడ్చాలనే స్పందన లేకపోవడం పట్ల రైతులు నిరసన వ్యక్తం చేస్తున్నారు.



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

నీటి నిల్వకు శాశ్వత పరిష్కారం

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీలోని డిగ్రీ కాలేజీ జంక్షన్ వద్ద 216 జాతీయ రహదారి కిందుగా ఉన్న సోన తూము ఏడాదిగా పూడిపోవడంతో వర్షాలు వస్తే సమస్య ఎదురవుతుంది. జబ్బర్ కాలనీ, జగన్నాథపురం, తానా కాలనీ, డిగ్రీ కాలేజీ పరిసర ప్రాంతాలు ప్రతి సారి నీట మునిగుతూ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాజాగా తుఫాన్‌తో చోటుచేసుకున్న వరదకు నీరు పారకపోవడంతో ఈ ప్రాంతాలు మళ్లీ మునిగిపోయాయి. సమస్య తీవ్రత గుర్తించిన అధికారులు తక్షణమే స్పందించారు. జెసిబీలతో పూడిక తొలగింపు పనులు వేగంగా చేస్తున్నారు. ఎంపిడిఒ మేడబలిని రాజేష్ బాబు, ఎస్ఐ పెనుమాల జనార్ధన్, సెక్రటరీ వై సంపత్‌కుమార్ స్వయంగా పర్యవేక్షణ చేపట్టారు. తాత్కాలికంగా పూడిక తీసి నీటి పారుదల సులభతరం చేశారు.

వరి రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలో తుఫాను కారణంగా వందల ఎకరాల వరి పొలాల్లో ఐదు అడుగుల మేర నీటి ప్రవాహంతో ఒక్కొక్క రైతు రూ.25వేల వరకు నష్టపోయారని ఎంపీపీ నీరు కట్టు వాసు బాబు, మాజీ ఎఎంసి చైర్మన్ జువ్వా శివరాం ప్రసాద్, సర్పంచుల సంఘం అధ్యక్షులు కొర్రపాటి అనిల్ తెలిపారు. స్వర్ణ, రంగప్పనాయుడు వారిపాలెం, కారంచేడు, కుంకలమర్రు ప్రాంతాల్లో ఈపాటికి 25వేల ఎకరాలు వరి సాగు చేశారని తెలిపారు. గతేడాది పొగాకు వేసి ఎకరానికి రూ.15 వేల నుండి రూ.20వేల వరకు గిట్టుబాటు ధర లేక నష్టపోతే ఈ ఏడాది తుఫానుతో ఎకరాకు రూ.25 వేలు చొప్పున నష్టపోయి ఏమి చేయాలో దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారని తెలిపారు.

నల్లమడ వాగును పరిశీలించిన కోన

ప్రజాశక్తి - బాపట్ల

వరద ఉధృతితో ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్న నల్లమడ వాగును జిల్లెళ్ళ మూడి వద్ద మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి గురువారం పరిశీలించారు. బలహీనపడ్డ కరకట్ట ప్రాంతాల వద్ద భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. ఈపాటికే మురుగుతూములు ఎగదన్ని పంట పొలాలు నీట మునగటంతో మురుగునరు పోయేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

అద్దంకి : తుఫాన్ వల్ల నష్ట పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చింతలపూడి అశోక్ కుమార్ కోరారు. మండలంలోని కొటికలపూడి, కుంకుపాడు గ్రామాల్లో నీట మునిగిన మొక్కజొన్న, మిరప పంటలను పరిశీలించారు. నష్ట పోయిన రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.

వాగు ఉధృతి పర్యవేక్షణ

ప్రజాశక్తి - చిన్నగంజాం

చిన్నగంజాం, పెదగంజాం, గొనాశపూడి గ్రామాల పరిసరాల్లోని నాగన్న వాగు, బుచ్చిగుంట, రొంపేరు బ్రిడ్జి, కొమ్మమూరు కాలువల్లో నీటి ప్రవాహం ఎక్కువగా ఉంది. ప్రస్తుతం రైల్వే అండర్‌పాస్, బుచ్చిగుంట, పెదగంజాం పోలేరమ్మ ఆలయం మధ్య ప్రాంతాల్లో నీటి ప్రవాహం కొనసాగుతూనే ఉంది. ప్రజల భద్రత దృష్ట్యా ఆ ప్రాంతాల్లో సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు తహశీల్దారు జె ప్రభాకరరావు తెలిపారు. రెవిన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ శాఖల అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు.

పొలాల పరిశీలన

ప్రజాశక్తి - బాపట్ల

నల్లమడ వాగు తూములు ఎగదన్ని మునిగిపోయిన వరి పొలాలను వ్యవసాయ అధికారులు గురువారం పరిశీలించారు. జిల్లెళ్ళమూడి, మూలపాలెం ప్రాంతాల్లో నీట మునిగిన వరి పొలాలు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వేరుశనగలో నష్ట నివారణ చర్యలు వివరించారు. ఎడిఎ కె ధనరాజు, ఎఒ శారద పాల్గొన్నారు.

ప్రమాదకరంగా నల్లమడ వాగు


నల్లమడ వాగు ఉధృతిని పరిశీలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

తుఫాను ప్రభావం నేపథ్యంలో పొంగి పొర్లుతున్న నల్లమడ వాగు ప్రవాహ ఉధృతిని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి వినోద్ కుమార్ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గురువారం బాపట్ల జిల్లాలో ప్రవహిస్తున్న నల్లమడ వాగు ప్రవాహాన్ని, నల్లమడ వాగు ప్రవహిస్తున్న పరిసర ప్రాంతాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. అప్పికట్ల రెవెన్యూ డివిజనల్ పరిధిలో ప్రవహిస్తున్న నల్లమడ వాగు ప్రవాహాన్ని కలెక్టర్ పరిశీలించి ప్రస్తుత నీటి ప్రవాహం గురించి డ్రైనేజీ అధికారులను ఆయన ఆరా తీశారు. నల్లమడ వాగు లో 42 వేల క్యూసెక్కుల వరద నీరు ప్రవహిస్తుందని, వరద ప్రవాహం నిలకడగా ఉందని డ్రైనేజీ శాఖ అధికారులు కలెక్టర్ కు వివరించారు. నల్లమడ వాగు ప్రవహించే తీర గ్రామాల వివరాలను బాపట్ల తాహసిల్దార్ మ్యాపు ద్వారా కలెక్టర్ కు వివరించారు. జిల్లెలమూడి డబల్ లైన్ వంతెన వద్ద నల్లమడ వాగు ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నల్లమడ వాగులో ప్రవహించే వరదనీరు పొంగి ఇరిగేషన్ పంట కాలువలో కి వెళుతున్న ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. నీటిని వంట కాలువలోకి తరలించేటప్పుడు నీరు పొలాల్లోకి వెళ్ళకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అధికారులకు తెలిపారు. నల్లమడ వాగులోని వరద నీరు జిల్లెలమూడి గ్రామానికి చేరి నందున ఆ ప్రవాహాన్ని డ్రోన్లు ద్వారా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. నీటి ఉధతి ఎక్కువైతే జిల్లెలమూడి గ్రామం ముంపుకి గురవుతుందని, గ్రామస్తులందరూ ముందస్తు చర్యలతో పునరావాస కేంద్రంకు వెళ్లాలని తెలిపారు. జిల్లెలమూడి గ్రామంలో శ్రీ విశ్వ జనని పరిషత్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రమును ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో బాపట్ల మండల ప్రత్యేక మరియు బీసీ సంక్షేమ శాఖ అధికారి శివ లీల, బాపట్ల డ్రైనేజీ డి.ఈ ధనలక్ష్మి, బాపట్ల తహసిల్దార్ సలీమా, బాపట్ల ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నిరంతర పర్యవేక్షణతో

భారీ నష్టాన్ని తగ్గించగలిగాం

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి


తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రులు పార్థసారథి, గొట్టిపాటి, ఎమ్మెల్యే ఏలూరి

ప్రజాశక్తి-పర్చూరు, బాపట్ల జిల్లా

సమగ్ర ప్రణాళిక, నిరంతర పర్యవేక్షణ, అధికారులు సమన్వయంతో పని చేయడం ద్వారానే మొంథా తుపాను భారీ నష్టాన్ని తగ్గించగలిగినట్లు జిల్లా ఇంచార్జి మంత్రి, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాలైన పర్చూరు, కారంచేడు మండలాలలో విస్తతంగా జిల్లా ఇంచార్జి మంత్రి, విద్యుత్ శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరి సాంబశివ రావు కలిసి గురువారం పర్యటించారు. వాడరేవు-పిడుగురాళ్ల మధ్య నిర్మిస్తున్న జాతీయ రహదారిని అడ్డంగా తవ్వించిన పర్చూరు మండలం ఉప్పుటూరు గ్రామం వద్ద పరిశీలించారు. జాతీయ రహదారిని తవ్వించిన ప్రాంతంలోనే గతంలో చిన్న వాగును మూత వేయడం ద్వారానే పర్చూరు మండలాన్ని వరద నీరు చుట్టుముట్టిందని గ్రామస్తులు మంత్రుల దృష్టికి తెచ్చారు. తక్షణమే జాతీయ రహదారి నిర్మిస్తున్న సదరు గుత్తేదారుడు దిగ్విజయ్ సింగ్‌తో మాట్లాడారు. భవిష్యత్తులో ఇలాంటి సమస్య పునరావతం గాకుండా రహదారి నిర్మించాలని సూచించారు. కారణాలు చెప్పడం మాని గతంలో ఇదే ప్రాంతంలో వాగు వెళ్తుంటే కల్వర్టు ఎందుకు నిర్మించలేదని గుత్తేదారుని ప్రశ్నించారు. ప్రజా ప్రయోజనమే ముఖ్యం, సమస్యలు రాకుండా సమగ్ర ప్రణాళికతో నిర్మించాలని సూచించారు. జాతీయ రహదారిపై నిర్మిస్తున్న టోల్ గేట్ వద్ద పర్చూరు వాగు గండి పడిన ప్రాంతాన్ని మంత్రులు పరిశీలించారు. కప్పల వాగు(మొండి వాగు) ఉధతికి జాతీయ రహదారి అయిదు మీటర్లకు పైగా కోతకు గురైన ప్రాంతాలు, పర్చూరు మండలంలో వరద నీట మునిగిన పొలాలు, కారంచేడు మండలంలో నీట మునిగిన పొలాలను మంత్రులు పరిశీలించారు. కారంచేడు మండలం కుంకులమర్రు గ్రామంలో కొమ్మమూరు కెనాల్ కాల్వ గండ్లు పడిన ప్రాంతం, పర్చూరు వాగు, కొమ్మమూరు కెనాల్ ఉధతికి ప్రమాదకరంగా ఒకే చోట కలిసి ప్రవహిస్తున్న ప్రాంతాలను మంత్రులు పరిశీలించారు. సెంటు భూమి ఉన్న ప్రతి రైతుకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారాన్ని ఇప్పిస్తామని జిల్లా ఇంచార్జి మంత్రి పార్థసారథి తెలిపారు. రైతులకు మేలు జరిగేలా అన్ని చర్యలూ తీసుకుంటామన్నారు. మిగిలిపోయిన పొగాకు కొనుగోలు చేయడానికి సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి దష్టికి తీసుకుని వెళ్లి పరిష్కారం అయ్యేలా కషి చేస్తామన్నారు. మంత్రుల వెంట ఆర్డిఓ పి.గ్లోరియా, నియోజకవర్గ ప్రత్యేక అధికారి ఉప కలెక్టర్ లవన్న, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

'మా ఇష్టం..అధికారం మాది..'

- వరద సాయానికి పేర్ల నమోదులో వివాదం
- టిడిపి, వైసిపి నేతల వాగ్వాదం


టిడిపి, వైసిపి నేతల మధ్య వాగ్వాదం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

తుపాన్ ప్రబావంతో మండలంలోని తిమ్మసముద్రం గ్రామంలో బిసి కాలనీ, అంబేద్కర్ నగర్ కాలనీల్లో వరద నీరు చేరడంతో వారిని అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు గ్రామంలో చర్చి, కళ్యాణమండపంలో పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశారు. ఆ కాలనీ వాసులను అక్కడకు తరలించి.. భోజన సదుపాయం కల్పించారు. వరద బాధితులకు ప్రభుత్వం రూ.3 వేల నగదు, నిత్యావసరాలు ఇస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో పునరావాస కేంద్రాలలో ఉన్న లబ్ధిదారుల వివరాలను సచివాలయంలో స్థానిక విఆర్ఓ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికార పార్టీ నాయకులు సచివాలయం వద్దకు చేరుకొని ఎవరెవరి పేర్లు నమోదు చేస్తున్నావని విఆర్ఓను వివరాలు అడిగారు. అదే సమయంలో వైసిపి నాయకులు అక్కడకు చేరుకొని అధికారపార్టీ వాళ్లని పక్కనే పెట్టుకొని లబ్ధిదారుల వివరాలు ఎలా నమోదు చేస్తారని విఆర్ఓని ప్రశ్నించారు. దీంతో అధికార పార్టీ నాయకులు 'మా ఇష్టం.. అధికారం మాది.. మా ఇష్టం వచ్చినట్లు చేసుకుంటాం' అనడంతో రెండు పార్టీల నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. మాటామాటా పెరగడంతో సచివాలయం వద్ద ఉద్రిక్త వాతావరణం నెలకొంది. నిబంధనల ప్రకారం తాము నమోదు చేస్తామని విఆర్ఓ అక్కడ నుంచి వచ్చి.. వేరే సచివాలయంలో పేర్లు నమోదు చేశారు. పూర్తి డేటా వచ్చిన తరువాత పూర్తి సమాచారం ఇస్తామని ఆర్ఐ రమేష్ తెలిపారు.


గండి పడిన ప్రాంతం

గుడిపాడు చెరువుకు గండి

వెంటనే మరమ్మతులు చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి- కనిగిరి

తుఫాను ప్రభావం కారణంగా గత మూడు రోజులుగా కురిసిన వర్షాల కారణంగా కనిగిరి మండలం గుడిపాడు పంచాయతీ పరిధిలోని దొనగొల్ల వాగు చెరువు కట్ట తెగిపోయింది. నీటి ప్రవాహంతో చెరువులోని నీరు బయటకు వెళ్తున్న విషయం ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి దృష్టికి వెళ్లింది. ఆయన ఆదేశాలతో అధికారులు జెసిబి ద్వారా చెరువు కట్ట గండిని పూడ్చారు.

తుపాన్ నుంచి

బాధితులు త్వరగా కోలుకోవాలి

మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

తుఫాను ప్రభావ పరిస్థితి నుంచి బాధితులు పూర్తిగా కోలుకొని సాధారణ జీవితాన్ని కొనసాగించేలా అవసరమైన అన్ని చర్యలను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి తెలిపారు. ఒంగోలు మండలం చెరువుకొమ్ముపాలెంలో ముంపునకు గురై పునరావాస కేంద్రాలలో ఆశ్రయం పొందిన ప్రజలకు ప్రభుత్వం ప్రకటించిన బియ్యం, ఇతర నిత్యవసర వస్తువుల పంపిణీ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమానికి జిల్లా పౌర సరఫరాల అధికారి ఎస్.పద్మశ్రీ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో మంత్రితో పాటు ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు, పౌరసరఫరాల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి డిబివి స్వామి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో అధికార యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమై సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టడంతో తుపాన్ సమయంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ వరలక్ష్మి, ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, తహశీల్దార్ పి.మధుసూదనరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మురుగునీటి ప్రవాహానికి

అడ్డంకులు లేకుండా చర్యలు

జోనల్ స్పెషల్ ఆఫీసర్ సిసోడియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పోతురాజు కాల్వ మురుగునీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చర్యలు తీసుకోవాలని, పారిశుధ్య కార్యక్రమాలు వేగవంతం చేయాలని జోనల్ స్పెషల్ ఆఫీసర్ ఆర్‌పి సిసోడియా అధికారులను ఆదేశించారు. సీనియర్ ఐఎఎస్ అధికారి, జోనల్ స్పెషల్ ఆఫీసర్ ఆర్‌పి సిసోడియా కలెక్టర్ పి.రాజాబాబు, జెసి ఆర్.గోపాలకృష్ణతో కలసి గురువారం ఒంగోలులో పర్యటించారు. పోతురాజు కాలువ పరిసరాలలో మున్సిపల్ అధికారులు నిర్వహిస్తున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మురుగునీటి ప్రవాహానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చర్యలు చేపట్టామని, రోడ్ల పైన, ఇళ్లలోనూ పేరుకుపోయిన బురదను తొలగించేందుకు ఫైర్ ఇంజన్లతో కడిగిస్తున్నట్లు జోనల్ స్పెషల్ ఆఫీసర్‌కు వివరించారు. పర్యటనలో సిసోరియా వెంట కలెక్టర్ పి.రాజాబాబు, సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ, ఒంగోలు ఆర్డీవో కె.లక్ష్మి ప్రసన్న, ఇతర అధికారులు ఉన్నారు. అనంతరం కలెక్టర్, జాయింట్ కలెక్టర్లతో ఆర్‌పి సిసోడియా ప్రత్యేకంగా పరిస్థితిపై ప్రకాశం భవనంలో సమీక్షించారు.

ముందస్తు ప్రణాళికతో

'మొంథా'ను ఎదుర్కొన్నాం..

- 24 గంటల వ్యవధిలోనే వరద నీటిని తరలించాం
- జిల్లా అధికారుల పనితీరు భేష్
- ప్రెస్‌మీట్‌లో ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల వెల్లడి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జనార్ధన్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ముందస్తు ప్రణాళికతో 'మొంథా' తుపాన్‌ను ఇటువంటి ప్రాణనష్టం లేకుండా సమర్ధవంతంగా ఎదుర్కోగలిగామని ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు పేర్కొన్నారు. ఒంగోలు టిడిపి కార్యాలయంలో ఎన్టీఆర్ భవన్‌లో గురువారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో ఎమ్మెల్యే దామచర్ల మాట్లాడుతూ మొంథా తుపాన్ కారణంగా జిల్లాలో అత్యధిక వర్షపాతం నమోదు అయిందన్నారు. ఈనెల 28 ఉదయం 8.30 నుండి 29వ తేదీ ఉదయం 8 గంటల వరకు జిల్లాలో సగటున 18.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. అందులో ఒంగోలులో 25.72 సెంటీమీటర్ల వర్షం కురిసిందని, 2010లో వచ్చిన లైలా తుపాన్ కన్నా ఇప్పుడు వచ్చిన మొంథా తుఫానులో అధికంగా మూడు సెంటీమీటర్ల వర్షపాతం నమోదైందన్నారు. తుపాన్ పరిస్థితిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర మంత్రి లోకేష్ రియల్ టైం గవర్నెన్స్ సిస్టం ద్వారా ఎప్పటికప్పుడు సమీక్షించి తక్షణ సహాయక చర్యలు చేపట్టారన్నారు. తనకు ముఖ్యమంత్రి రెండుసార్లు, మంత్రి నారా లోకేష్ 3 సార్లు ఫోన్ చేసి తుఫాన్ ప్రభావంపై చర్చించినట్లు వివరించారు. జిల్లాలోని ఒంగోలు, సంతనూతలపాడు, కొండపి నియోజకవర్గం సహా మిగతా నియోజకవర్గాలన్నీ తుపాన్ ప్రభావానికి లోనయ్యాయన్నారు. ఒంగోలులోని 15 డివిజన్ల పరిధిలో 53 కాలనీలు తీవ్ర ముంపుకు గురయ్యాయన్నారు. మున్సిపల్ సిబ్బంది సహకారంతో తాత్కాలిక కాలువలు ఏర్పాటు చేసి నీటిపారుదల చర్యలు చేపట్టామన్నారు. ఆపద సమయంలో వైసిపి నాయకులు విమర్శలు మాని, ప్రజాసేవకు అంకితం అవ్వాలని హితవు పలికారు. తుపాన్‌ను ఎదుర్కోవటంలో పూర్తి సహకారం అందించిన జోనల్ స్పెషల్ ఆఫీసర్లు సిసోడియా, జిల్లా ప్రత్యేక అధికారి కోన శశిధర్‌లతో పాటుగా కలెక్టర్ రాజాబాబు, సంయుక్త కలెక్టర్ గోపాలకష్ణ, డిఆర్ఓ ఓబులేసు, ఆర్డీవో కె.లక్ష్మీ ప్రసన్న, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, తహశీల్దార్ మధుసూదనరావు, వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, గ్రామ సచివాలయ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు కషితోనే తుపాన్‌ను సమర్ధవంతంగా ఎదుర్కోగలిగామని తెలిపారు. సమావేశంలో ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ షేక్ రియాజ్, ఒంగోలు మేయర్ గంగాడ సుజాత, ఒంగోలు ఏఎంసి చైర్మన్ రాచగర్ల వెంకట్రావు, డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ, మాజీ ఏఎంసి చైర్మన్లు సింగరాజు రాంబాబు, కామేపల్లి శ్రీనివాసరావు, కార్పొరేటర్ ఆదిపూడి శంకర్ శాండిల్య పాల్గొన్నారు.